TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక



07

భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో డీఏవీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం..




హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 72 | 25-07-2026 శనివారం | పేజీలు: 08 | వెల: 3/-

# నీట్ లీకేజీపై బీఆర్ఎస్ సమరశంఖం

ధర్నా చౌక్‌లో
కేటీఆర్ భారీ నిరసన
విద్యాశాఖ మంత్రి
రాజీనామాకు డిమాండ్!
కేటీఆర్ ఆధ్వర్యంలో
ఉధృతమైన పోరాటం
పుట్టినరోజు వేడుకలు
రద్దు చేసుకున్న కేటీఆర్
నల్ల చొక్కా ధరించి
ధర్నా చౌక్‌కు రాక
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
చేయాలని డిమాండ్
కేంద్ర ప్రభుత్వంపై
కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, (డిడి9 వార్త): దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ యుజీ ప్రశ్నపత్రాల లీకేజీకి నిరసనగా మరియు ఢిల్లీలో పోరాడుతున్న విద్యార్థులపై కేంద్ర పోలీసుల అణచివేత ధోరణికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ పోరుబాట పట్టింది. బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి విభాగమైన బీఆర్ఎస్వీ పిలుపు మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ (ధర్నా చౌక్) వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నాకు రాజధానితో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన వ్యక్తిగత వేడుకలను పక్కనబెట్టారు. శుక్రవారం తన జన్మదినం ఉన్నప్పటికీ, సంబరాలకు దూరంగా మిగతా 2లో..



# లిఖిత పూర్వక హామీ ఇచ్చాకే దీక్ష విరమించా

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్పష్టీకరణ
పార్లమెంట్‌లో చర్చిస్తామని సర్కార్ హామీ
విద్యార్థులపై కేసులు పెట్టబోమని కేంద్రం స్పష్టత
బాధిత కుటుంబాలకు ఆసరా
ఇస్తామని సర్కారు హామీ ఇచ్చిందన్న సోనమ్
విద్యాశాఖ మంత్రి రాజీనామా వరకు పోరాటం ఆగదన్న దీప్కే
జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న విద్యార్థుల నిరసనలు
మోదీ వీడియోపై మండిపడిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
యువతకు ప్రధాని క్షమాపణలు చెప్పాలని రాహుల్ డిమాండ్



02

## నీట్ యుజీ లీకేజీ రచ్చ

విద్యాశాఖ మంత్రి రాజీనామాకు
పట్టుపడుతున్న విపక్షాలు
నాలుగో రోజూ పార్లమెంట్
మకరద్వారం వద్ద విపక్ష ఎంపీల నిరసన
పరస్పరం విమర్శలు
గుప్పించుకున్న అధికార, ప్రతిపక్షాలు
యువత భవిష్యత్తుపై
కాంగ్రెస్ మూడు ప్రధాన డిమాండ్లు
ప్రధాని మోదీ సభలోనే ప్రకటన
చేయాలని ఖర్గే స్పష్టం
ప్రధాని ఫాస్ట్ ట్రాక్ కోర్టుల
హామీ అసత్యమైనది
ఆప్ అధినేత కేజ్రీవాల్ తీవ్ర వ్యాఖ్యలు



03

## లోతుకుంట భూముల కేసులో హైడ్రాకు హైకోర్టు షాక్..

హైడ్రా తీరుపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
కోర్టు ఆదేశాల ఉల్లంఘనపై తీవ్ర ఆగ్రహం
కమిషనర్ రంగనాథ్‌కు
అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం
తదుపరి విచారణ
సోమవారానికి వాయిదా


హైదరాబాద్, (డిడి9 వార్త): హైదరాబాద్‌లోని లోతుకుంట భూముల వివాదంపై తెలంగాణ హైకోర్టులో మరోసారి తీవ్రస్థాయిలో విచారణ జరిగింది. కోర్టు ఆదేశాలను లెక్కచేయకుండా వ్యవహరించడంపై హైకోర్టు ధర్మాసనం హైడ్రా (HYDRAA) తీరును తీవ్రంగా తప్పపట్టింది. ఈ విచారణకు హైడ్రా మిగతా 2లో..



## విద్యార్థుల నోళ్లు నొక్కుతారా?

విద్యాసంస్థల సర్క్యులర్‌పై రాహుల్ గాంధీ ఆగ్రహం
వర్సిటీల హెచ్చరికలపై మండిపడిన కాంగ్రెస్ అగ్రనేత
ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తున్నారంటూ విమర్శలు
సమయం వచ్చినప్పుడు జవాబుదారీగా ఉండాలని హెచ్చరిక
జంతర్ మంతర్ ఆందోళనలపై నిషేధం విధించిన విద్యాసంస్థలు
సోషల్ మీడియా పోస్టులపై డీయూ, జేఎన్‌యూల ఆంక్షలు
తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్న ఎంపీ హుడా
మౌనం వహిస్తే దేశం ముందుకు వెళ్లదన్న సీజేపీ
హక్కులకు మద్దతుగా నిలవాలని పూజా భట్ పిలుపు

హైదరాబాద్, (డిడి9 వార్త): నీట్ :పేపర్ లీకేజీకి నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలకు దూరంగా ఉండాలని పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు విద్యార్థులను హెచ్చరించడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ మిగతా 2లో..



## సింగరేణి విస్తరణకు సంపూర్ణ మద్దతు



హైదరాబాద్, (డిడి9 వార్త): సింగరేణి సంస్థను ప్రపంచ స్థాయిలో పోటీపడే వ్యాపార దిగ్గజంగా తీర్చిదిద్దడానికి మరియు పరిరక్షించడానికి మిగతా 2లో..

గ్లోబల్ సంస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం అండదండలు
భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మార్పులు
బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా విస్తరణ
అరుదైన ఖనిజాల ఉత్పాదనపై దృష్టి సారించాలి
కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష
సింగరేణి, జెన్‌కో అధికారులతో కీలక భేటీ
ప్రైవేటీకరణ సవాళ్లను ఎదుర్కోవాలని సూచన
నాణ్యత, పారదర్శకతతోనే పోటీలో విజయమన్న భట్టి
గత ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర విమర్శలు



## గుజరాత్‌ను ముంచెత్తిన వరద

అసోం, జమ్మూకశ్మీర్‌లలో
కొనసాగుతున్న ఉధృతి
వందలాది మంది సురక్షిత
ప్రాంతాలకు తరలింపు
వల్సాడ్ జిల్లాలో పడవలు,
హెలికాప్టర్లతో సహాయక చర్యలు
నవసారి జిల్లాలో ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ
వరద నీటి నుంచి 67 మంది
గ్రామీణుల సురక్షిత తరలింపు
సురేంద్రనగర్ జలదిగ్బంధం
డిప్యూటీ సీఎం సమీక్ష
లఖ్తర్ తాలూకాలో 27 మందిని
కాపాడిన అధికారులు
అసోంలో తీవ్రరూపం దాల్చిన వరదలు
ఇప్పటివరకు 47 మంది ప్రాణాలు బలి

హైదరాబాద్, (డిడి9 వార్త): గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తీవ్రమైన వరద బీభత్సం నెలకొంది. ప్రత్యేకించి వల్సాడ్ జిల్లాలో వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తడంతో స్థానిక యంత్రాంగం రెస్క్యూ చర్యలను ముమ్మరం చేసింది. వాపి సిటీ రెవెన్యూ అధికారి కాంతిభాయ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. నీటిలో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు పడవలతో పాటు కొన్ని అత్యవసర ప్రాంతాల్లో హెలికాప్టర్లను కూడా ఉపయోగిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, స్థానిక విపత్తు స్పందన దళాలు బాధితులకు ఆహారం, తాగునీరు మరియు ప్రాథమిక వైద్య సదుపాయాలు అందిస్తున్నాయి. నవసారి జిల్లా సరిఖురాద్ గ్రామం ఆకస్మిక వరద నీటిలో చిక్కుకుపోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ 6వ బెటాలియన్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు మిగతా 2లో..

## దూర ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు వద్దు

జనావాసాల్లోనే
నిర్మించాలని సీఎం ఆదేశం
ఉపాధికి దూరం
కాకూడదన్న రేవంత్
నిరుపయోగ భూముల
గుర్తింపునకు సూచన
17 నియోజకవర్గాల్లో
7,680 ప్లాట్లు
రూ.5 లక్షల సబ్సిడీ
ఇవ్వనున్న ప్రభుత్వం
పనులు వేగవంతం చేయాలని
అధికారులకు ఆదేశం

హైదరాబాద్, (డిడి9 వార్త): జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే క్యూర్ పరిధిలో ఇందిరమ్మ గృహాలను నిర్మించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలోని నిరుపయోగ భూములను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. క్యూర్ పరిధిలో చేపట్టనున్న ఇందిరమ్మ గృహాలపై శుక్రవారం జరిగిన సమీక్షలో సీఎం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు చెందిన వినియోగంలో లేని స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ఆయా శాఖలకు ప్రత్యామ్నాయ భూములు కేటాయించి, ఆ స్థలాలను గృహ నిర్మాణానికి మిగతా 2లో..



## హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ ఉద్రిక్తం

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనానికి యత్నం
రాహుల్ గాంధీపై దాడి, విద్యార్థుల అరెస్టులను ఖండించిన నేతలు
హిమాయత్‌నగర్ నుంచి హైదర్‌గూడ వరకు భారీ ర్యాలీ నిర్వహణ
కాంగ్రెస్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారంటూ మండిపాటు
ర్యాలీని అడ్డుకున్న పోలీసులు..
కాంగ్రెస్ కార్యకర్తలతో తీవ్ర తోపులాట

02



# గుజరాత్‌ను ముంచెత్తిన వరద

మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. బాధితుల్లో ఉన్న 25 మంది మహిళలు, 22 మంది చిన్నారులతో సహా మొత్తం 67 మందిని రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఆ ప్రాంతంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారేమోనన్న అనుమానంతో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు.

సురేంద్రనగర్ జిల్లా లఖ్తర్ తాలూకాలోని ఓలాక్ గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టడంతో ప్రజలు జలదిగ్బంధంలో ఇరుక్కుపోయారు. వెంటనే స్పందించిన జిల్లా యంత్రాంగం, పోలీసు మరియు అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి 27 మందిని కాపాడారు. రాష్ట్రంలో ఉత్పన్నమైన ఈ అత్యవసర పరిస్థితులపై గుజరాత్ డిప్యూటీ సీఎం ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మరోవైపు ఈశాన్య రాష్ట్రమైన అసోంలో వరద పరిస్థితి అత్యంత భయానకంగా మారింది. నిరంతరం కురుస్తున్న వర్షాల ధాటికి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో అనేక ప్రాంతాలు నీటమునిగాయి. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించిన అధికారిక గణాంకాల ప్రకారం, ఈ వరద విపత్తు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 47 మంది మరణించారు. దాంతో బాధితులను రక్షించేందుకు రెస్క్యూ బృందాలు శ్రమిస్తున్నాయి.అసోం రాజధాని గువాహటిలోని హటిగావ్, అనిల్ నగర్, బెల్టోల వంటి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. మోకాళ్ల లోతు నీరు చేరడంతో వందలాది ఇళ్లు, దుకాణాలు, పాఠశాలల్లోకి వరద నీరు చేరింది. రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి జనజీవనం పూర్తిగా స్తంభించింది. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కామ్రూప్ మెట్రో జిల్లా యంత్రాంగం గువాహటిలోని అన్ని విద్యాసంస్థలకు ముందస్తు సెలవులను ప్రకటించింది.

రాబోయే రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు. వరద పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించేందుకు ప్రభావిత జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, ఉన్నతాధికారులతో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎం హిమంత బిశ్వశర్మ ప్రత్యేక సమావేశం కానున్నారు.

ఉత్తరాదిన జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని కూడా వర్షాలు విపరీతంగా ముంచెత్తుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ఉధంపూర్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఒక్కసారిగా ఆకస్మిక వరదలు పారాయి. దీని ప్రభావంతో పలు నివాస గృహాలు పాక్షికంగా దెబ్బతినగా, వ్యవసాయ పంటలు నీట మునిగి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ముందస్తు జాగ్రత్త చర్యగా బాధితులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఉధంపూర్ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదల్లో ఎలాంటి ప్రాణనష్టం నమోదు కాకపోవడం ఊరటనిచ్చే అంశం. అయితే, వరదలు మరియు కొండచరియలు విరిగిపడటం వల్ల ఆస్తిపాస్తులు, పంటలకు జరిగిన నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో అంచనా వేస్తున్నారు. వర్షాలు ఇంకా కొనసాగే అవకాశం ఉన్నందున కొండ ప్రాంతాల ప్రజలు మరియు నదీ పరివాహక ప్రాంతాల నివాసితులు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ దళాలు హెచ్చరించాయి.

# లిఖిత పూర్వక హామీ ఇచ్చాకే దీక్ష విరమించా

హైదరాబాద్, (డిడి9 వార్త):

దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, పరీక్షల నిర్వహణలో అక్రమాలపై ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఎట్టకేలకు ముగిసింది. గత 26 రోజులుగా నిరసన తెలుపుతున్న ఆయన, కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించడంతో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత తన దీక్షను విరమించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌ల సమక్షంలో సోనమ్ వాంగ్‌చుక్ నిమ్మరసం తాగి దీక్ష ముగించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రత్యేక సందేశాన్ని పంపారు. వైద్యుల సూచనలు పాటించి సోనమ్‌జీ వేగంగా కోలుకోవాలని, వీలైనంత త్వరగా ఆయన బరువు పెరిగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ప్రధాని తన ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

దీక్ష విరమణ అనంతరం శుక్రవారం ఉదయం సోనమ్ వాంగ్‌చుక్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన లిఖితపూర్వక హామీ వచ్చినందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల నిర్వహణలో జవాబుదారీతనం మరియు విద్యా వ్యవస్థలో విస్తృత స్థాయి సంస్కరణలపై రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో సమగ్రంగా చర్చిస్తామని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిందని చెప్పారు. అలాగే శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని, ఈ పేపర్ లీక్ ఘటనల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై మరణించిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకుంటామని కూడా ప్రభుత్వం మాట ఇచ్చిందని సోనమ్ వివరించారు. సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష విరమణపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి దేశాన్ని మేల్కొలిపినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అయితే నీట్ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంతవరకు న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ పోరాటం ఆగదని దీప్కే స్పష్టం చేశారు. మరోవైపు పేపర్ లీక్‌లకు చెక్ పెడుతూ కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ అర్ధరాత్రి విడుదల చేసిన వీడియోపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మన విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతున్నారని, ప్రధాని ఇలాంటి వీడియోలతో వారిని అవమానించకూడదని రాహుల్ విమర్శించారు. ప్రభుత్వం వెంటనే యువతకు క్షమాపణ చెప్పాలని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దౌర్జన్యాలకు పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# లోతుకుంట భూముల కేసులో హైడ్రాకు హైకోర్టు షాక్..

మొదటిపేజీ తరువాయి




తరఫున అడ్వకేట్ జనరల్ (AG) సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ వైఖరిపై న్యాయస్థానం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది.

**హైడ్రా తీరుపై ఘాటు వ్యాఖ్యలు**

విచారణ సమయంలో హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "రెవెన్యూ, నీటిపారుదల (ఇరిగేషన్) చట్టాలను పక్కనబెట్టి కేవలం హైడ్రా చట్టం ఒక్కటే ఉందా?" అని న్యాయస్థానం ప్రశ్నించింది. హైకోర్టు ఇచ్చే ఆదేశాలను ఉల్లంఘించడం హైడ్రాకు ఒక అలవాటుగా మారిపోయిందని ధర్మాసనం మండిపడింది. ఒకే భూమికి సంబంధించి మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లలో ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడం అనేది కోర్టు చరిత్రలోనే మునుపెన్నడూ లేదని స్పష్టం చేసింది.

**కోర్టు ఆదేశాలు**

**లెక్కచేయకపోవడం తీవ్ర నేరం**

కోర్టు ధిక్కరణ ఉత్తర్వులపై ఉన్నత స్థానాల్లో అప్పీలు చేయకుండా, మళ్లీ అదే భూమిలోకి వెళ్లడం తీవ్రమైన నేరమని హైకోర్టు వ్యాఖ్యానించింది. కేవలం ఒక సాధారణ ఫిర్యాదును ఆధారంగా చేసుకుని, న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను సైతం లెక్కచేయకుండా లోతుకుంట భూముల్లోకి ఎలా వెళ్తారని హైడ్రా అధికారులను ప్రశ్నించింది.

**కమిషనర్ క్షమాపణలతో**

**అఫిడవిట్ దాఖలుకు ఆదేశం**

ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేసేందుకు అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టును సమయం కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా క్షమాపణలు తెలుపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

# సింగరేణి విస్తరణకు సంపూర్ణ మద్దతు

మొదటిపేజీ తరువాయి




రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వ తలుపులు నిరంతరం తెరిచే ఉంటాయని హామీ ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, అందుకు తగ్గట్లుగానే సింగరేణి కూడా తన వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రాబోయే 15 నుంచి 20 ఏళ్లలో ఇంధన రంగంలో ఊహించని మార్పులు రాబోతున్నాయని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. సౌర విద్యుత్, పంప్డ్ స్టోరేజ్, పవన విద్యుత్, హైడ్రోజన్ మరియు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో థర్మల్ విద్యుత్ మరియు బొగ్గుపై ఆధారపడటం క్రమంగా తగ్గుతుందన్నారు. అందుకే సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా, అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్) తవ్వకాల్లోకి అత్యంత క్రియాశీలకంగా అడుగుపెట్టాలని సూచించారు.

కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో గురువారం సింగరేణి మరియు జెన్‌కో ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థ ఉత్పత్తి, భవిష్యత్ ప్రణాళికలు మరియు సవాళ్లపై సమగ్రంగా చర్చించారు. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధప్రకాష్ సహా ఇతర ముఖ్య అధికారులు ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు.

సింగరేణిని తెలంగాణ రాష్ట్రానికి ఆత్మగా అభివర్ణించిన ఉప ముఖ్యమంత్రి, 130 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ విద్యా, పారిశ్రామిక నిలయం రాష్ట్ర అభివృద్ధిలో అత్యంత కీలక పాత్ర పోషించిందని అన్నారు. సింగరేణి నిరంతర ఎదుగుదలకు, సుస్థిరతకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఇది కేవలం ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదని, వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితాలతో ముడిపడి ఉన్న జీవనాడి అని వ్యాఖ్యానించారు.

ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తిలో సింగరేణికి ఏకఛత్రాధిపత్యం ఉండేదని, అయితే ప్రైవేటీకరణ విస్తరణతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను వేలం వేసే విధానం తీసుకురావడంతో ప్రైవేట్ సంస్థలు రంగంలోకి దిగాయని, దీంతో ప్రభుత్వ రంగ సంస్థలు పోటీని ఎదుర్కోక తప్పడం లేదన్నారు. బొగ్గు నాణ్యతను పెంచడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం మరియు సమర్థవంతమైన సేవలందించడం ద్వారానే ప్రైవేట్ కంపెనీలపై విజయం సాధించగలమని స్పష్టం చేశారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి దీర్ఘకాలిక ఆలోచన, వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడం వల్లే బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనక సింగరేణి నూతన వనరులను కోల్పోయిందని డిప్యూటీ సీఎం విమర్శించారు. భద్రాద్రి, యాదాద్రి వంటి భారీ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు సరైన ప్రణాళికలు రూపొందించడంలో మరియు వాటికి అవసరమైన బొగ్గు బ్లాకులను సాధించడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ఒడిశాలోని నైని బ్లాక్, రాష్ట్రంలోని తాడిచర్ల 2 ప్రాజెక్టుల భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించామని చెప్పారు. సెమీకండక్టర్లు, మైక్రోచిప్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీకి అత్యంత కీలకమైన లిథియం, కోబాల్ట్ వంటి క్రిటికల్ మినరల్స్ తవ్వకాల్లోకి సింగరేణి విస్తరించాలని ప్రతిపాదించారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి విదేశాల్లో జరిగే క్రిటికల్ మినరల్స్ బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనాలని సూచించారు. సింగరేణి వద్ద దశాబ్దాల గనుల తవ్వకాల అనుభవం, అత్యుత్తమ ఇంజనీర్లు, అనుభవజ్ఞులైన సిబ్బంది ఉన్నారని, ఈ మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టుల కోసం ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

సింగరేణి డైరెక్టర్ల బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకూడదని, రాబోయే 10 సంవత్సరాల సమగ్ర రోడ్‌మ్యాప్ మరియు విస్తరణ వ్యూహాలపైనే దృష్టి సారించాలని ఆదేశించారు. నిబంధనలతో కూడిన క్యాలెండర్‌ను రూపొందించి కార్పొరేట్ శైలిలో నిర్ణీత గడువుల్లోగా లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ప్రతి గని వద్ద యాజమాన్యం, ట్రేడ్ యూనియన్లు కార్మికులతో బహిరంగ చర్చలు జరిపి, వారి సూచనలు స్వీకరిస్తూ కార్మికులను సంస్థ భవిష్యత్తులో భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు.

# విద్యార్థుల నోళ్లు నొక్కుతారా?

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న అక్రమాలు, తప్పులను ప్రశ్నించడానికి విద్యార్థులు తమకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అలాంటిది విద్యార్థులను ఆందోళనల్లో పాల్గొనవద్దని హెచ్చరించడానికి యాజమాన్యాలకు ఎంత ధైర్యమని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సమయం వచ్చినప్పుడు విద్యార్థుల హక్కులను కాలరాసేలా వ్యవహరించిన ఆయా విశ్వవిద్యాలయాలు ఖచ్చితంగా జవాబుదారీగా ఉండాల్సి ఉంటుందని హెచ్చరించారు.

జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ఆందోళనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, కాబట్టి విద్యార్థులెవరూ ఆ ప్రాంతానికి వెళ్లవద్దని ఢిల్లీ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఐఐటీ రూర్కీ, ఐఐటీ మద్రాస్ సహా పలు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు తమ విద్యార్థులకు ప్రత్యేక సర్క్యులర్‌లు జారీ చేశాయి. అంతేకాకుండా సోషల్ మీడియాలో కూడా ఈ నిరసనలకు మద్దతుగా ఎలాంటి పోస్టులు పెట్టకూడదని ఆంక్షలు విధించాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే ఈ ప్రకటనలు విడుదల చేశామని విద్యాసంస్థలు స్పష్టం చేయగా, దీనిపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విశ్వవిద్యాలయాలు విడుదల చేసిన ఈ వివాదాస్పద సర్క్యులర్‌పై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా తీవ్రంగా స్పందించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా, ఒక పార్లమెంట్ సభ్యుడిగా డీయూ జారీ చేసిన ప్రకటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలు తెలపడం చట్టవిరుద్ధమని ఎవరు ప్రకటించారని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి సున్నితమైన విషయాల్లో యాజమాన్యాలు తప్పుడు ప్రచారాలు చేయడం నిజంగా సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

మరోవైపు నటి, చిత్రనిర్మాత పూజా భట్ కూడా వర్సిటీల వైఖరిని ఎండగట్టారు. విద్యార్థుల గొంతులను అణచివేయడం వల్ల వారి భద్రత మరింత ప్రమాదంలో పడుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పుడు మౌనం వహిస్తే సమాజం ఇంకెప్పటికీ ముందుకు వెళ్లలేదని సీజేపీ వ్యాఖ్యానించగా, విద్యార్థుల భవిష్యత్తుపై నిజంగా ఆందోళన ఉంటే మౌనంగా ఉండకుండా వారి ప్రజాస్వామ్య హక్కులకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పూజా భట్ పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ ఉద్రిక్తం

- **కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనానికి యత్నం**
- **రాహుల్ గాంధీపై దాడి, విద్యార్థుల అరెస్టులను ఖండించిన నేతలు**
- **హిమాయత్‌నగర్ నుంచి హైదర్‌గూడ వరకు భారీ ర్యాలీ నిర్వహణ**
- **కాంగ్రెస్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన**
- **కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్**
- **విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారంటూ మండిపాటు**
- **ర్యాలీని అడ్డుకున్న పోలీసులు..**
- **కాంగ్రెస్ కార్యకర్తలతో తీవ్ర తోపులాట**



హైదరాబాద్, (డిడి9 వార్త):

దేశ రాజధాని దిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై జరిగిన దాడితో పాటు, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీ ఛార్జీ, అరెస్టులను ఖండిస్తూ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ సీనియర్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి తమ నిరసనను తెలిపారు. హిమాయత్‌నగర్ కూడలి మరియు వై జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు కొనసాగింది.

ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. నీట్ (NEET) పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు మరియు జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను కూడా భద్రంగా కాపాడలేని నాయకులు, ఇక ఈ దేశాన్ని ఎలా కాపాడుతారని ఆయన నిలదీశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని, ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాలని పట్టుబట్టారు.

ర్యాలీ హైదర్‌గూడ వద్దకు చేరుకోగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నించారు. అయితే పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకోవడంతో ఒక్కసారిగా పరిస్థితులు వేడెక్కాయి. పోలీసులు మరియు కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర తోపులాట జరగడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.

# నీట్ లీకేజీపై బీఆర్ఎస్ సమరశంఖం

మొదటిపేజీ తరువాయి





ఉంటూ నల్ల చొక్కా ధరించి నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థుల హక్కులు, న్యాయమైన డిమాండ్ల కోసం నేరుగా ధర్నా స్థలానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. కేటీఆర్ రాకతో ధర్నా చౌక్ పరిసరాలు విద్యార్థుల నినాదాలతో హోరెత్తాయి.

ధర్నాలో మాట్లాడిన కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల ఎంతోమంది అర్హులైన విద్యార్థుల కష్టం బూడిదలో పోసిన పన్నీరైందని, దీనికి కేంద్ర పాలకులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.దేశ రాజధాని ఢిల్లీలో న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు ప్రయోగించిన బలాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై పోలీసుల జులుం నశించాలని, వారిపై సాగుతున్న దమనకాండను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి వారిపై లాఠీఛార్జీలు, అరెస్టులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. "ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులు చూస్తుంటే చాలా బాధగా ఉంది. కళ్లలో నీళ్లొస్తున్నాయి. విద్యార్థులేమైనా మోదీ, అమిత్ షాల కుర్చీలు అడిగారా? లేక రాజీనామాలు చేసి ప్రభుత్వాన్ని అప్పగించమన్నారా? కేవలం తమకు జరిగిన అన్యాయంపై శాంతియుతంగా న్యాయం మాత్రమే అడిగారు" అని కేటీఆర్ ప్రశ్నించారు. యువత శక్తిని తక్కువ అంచనా వేయొద్దని పాలకులకు హితవు పలికారు. ఇది భయపడే జనరేషన్ కాదని, పాలకులనే భయపెట్టే జనరేషన్ అని హెచ్చరించారు. ఇటీవల యువత ఆగ్రహానికి గురై నేపాల్, బంగ్లాదేశ్ ప్రభుత్వాలు ఎలా కుప్పకూలాయో కేంద్రం గుర్తుంచుకోవాలని సూచించారు.గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మరియు కేంద్రంలో ఉన్న పాలకుల మెడలు వంచి ప్రత్యేక తెలంగాణ సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడు కూడా విద్యార్థుల భవిష్యత్తు కోసం, వారి న్యాయమైన హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వ అరాచకాలను గట్టిగా ఎండగడతామని స్పష్టం చేశారు. ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, విద్యార్థుల పక్షాన ఢిల్లీ పాలకులపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. తాము కేంద్ర ప్రభుత్వ తప్పులను, వినాశకర విధానాలను ఎండగట్టేందుకు నిరసన తెలుపుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు భయంగా ఉందని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ చేపట్టిన ధర్నాను అడ్డుకునేందుకు యూత్ కాంగ్రెస్ యత్నించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రానికి వ్యతిరేకంగా చేసే పోరాటానికి మద్దతు ఇవ్వాల్సింది పోయి అడ్డుపడటం కాంగ్రెస్ నైజానికి నిదర్శనమన్నారు.నీట్ లీకేజీ బాధితులకు పూర్తిగా న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ విద్యార్థుల పక్షాన నిలబడి పోరాడుతుందని కేటీఆర్ పునరుద్ఘాటించారు. దేశవ్యాప్తంగా పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా యువత అంతా ఒకే తాటిపైకి వచ్చి కదం తొక్కుతోందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే ఏ ప్రభుత్వమైనా పతనం కాక తప్పదని హెచ్చరిస్తూ, ప్రతి విద్యార్థికీ ఇన్సాఫ్ లభించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ ప్రధాన నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు మరియు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది విద్యార్థులు భాగస్వాములయ్యారు.

# దూర ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు వద్దు

మొదటిపేజీ తరువాయి



వినియోగించాలని చెప్పారు.

జనావాసాలకు దూరంగా ఇళ్లు నిర్మిస్తే లబ్ధిదారులు వాటిలో నివసించే పరిస్థితి ఉండదని, జీవనోపాధిపై ప్రభావం పడే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. అందువల్ల పని ప్రదేశాలకు సమీపంలోనే గృహ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఇందిరమ్మ ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఒక్కో ఫ్లాట్‌ను 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనుండగా, నిర్మాణ వ్యయం సుమారు రూ.11 లక్షలు అవుతుంది. ఇందులో రూ.5 లక్షల సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుండగా, మిగిలిన రూ.6 లక్షలు లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుంది. భూమి వ్యయాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి తదితర 17 నియోజకవర్గాల్లో ఈ గృహాల నిర్మాణం చేపట్టనున్నారు. సంబంధిత ప్రాంతాల్లో నిరుపయోగ ప్రభుత్వ భూముల గుర్తింపును వేగవంతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# నీట్ యుజీ లీకేజీ రచ్చ

- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుపడుతున్న విపక్షాలు
- నాలుగో రోజూ పార్లమెంట్ మకరద్వారం వద్ద విపక్ష ఎంపీల నిరసన
- పరస్పరం విమర్శలు గుప్పించుకున్న అధికార, ప్రతిపక్షాలు
- యువత భవిష్యత్తుపై కాంగ్రెస్ మూడు ప్రధాన డిమాండ్లు
- ప్రధాని మోదీ సభలోనే ప్రకటన చేయాలని ఖర్గే స్పష్టం
- ప్రధాని ఫాస్ట్ ట్రాక్ కోర్టుల హామీ అసత్యమైనది
- ఆప్ అధినేత కేజ్రీవాల్ తీవ్ర వ్యాఖ్యలు

**హైదరాబాద్ డిడి9 వార్త**

దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన నీట్ యుజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ విపక్ష ఎంపీలు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని మకరద్వారం వద్ద విపక్ష కూటమి ఎంపీలు వరుసగా నాలుగో రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ప్లకార్డులు మరియు బ్యానర్లను ప్రదర్శించారు.
పార్లమెంట్ పరిసరాల్లో నిరసనల వేడి తీవ్రస్థాయికి చేరింది. ఒకవైపు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు మంత్రి రాజీనామాకు పట్టుబడుతుండగా, మరోవైపు అధికార ఎన్‌డీఏ ఎంపీలు కూడా పోటీగా నిరసన ప్రదర్శనలు నిర్వహించడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. నీట్ లీకేజీ అంశంపై సభలో నిర్మాణాత్మక చర్చ జరగకుండా విపక్షాలు ఉద్దేశపూర్వకంగా సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నాయని అధికార పక్షం ఆరోపించగా, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రభుత్వం బాధ్యత వహించే వరకు వదిలేదే లేదని విపక్షాలు స్పష్టం చేశాయి. నీట్ లీకేజీ సంక్షోభంపై కాంగ్రెస్ పార్టీ తమ మూడు ప్రధాన డిమాండ్లను సామాజిక మాధ్యమం ద్వారా దేశ ప్రజల ముందుకు తెచ్చింది. మొదటిది విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, రెండోది నిరసన తెలుపుతున్న విద్యార్థులపై హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మూడోది దేశ యువతకు ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ కోరింది. అర్ధరాత్రి ప్రకటనలు జారీ చేయడం మాని, ప్రధాని నేరుగా పార్లమెంట్ సభ వేదికగానే ఈ అంశంపై మాట్లాడితేనే దానికి ప్రామాణికత ఉంటుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. పేపర్ లీక్ చేసిన దోషులను శిక్షించేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వీడియో విడుదల చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల కోసం చట్టం తెస్తామని చెప్పిన ప్రధాని హామీలు ఎంత అసత్యమైనవో మరుసటి రోజే రుజువైందని ఎద్దేవా చేశారు. నిజంగా దోషులను శిక్షించే ఉద్దేశం ఉంటే క్షేత్రస్థాయిలో చర్యలు దానికి విరుద్ధంగా ఎందుకు ఉంటున్నాయని కేజ్రీవాల్ ప్రశ్నించారు.
నీట్ 2024 పేపర్ లీక్ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న సంజీవ్ ముఖియాకు బెయిల్ లభించడాన్ని కేజ్రీవాల్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముఖియాకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదని సీబీఐ కోర్టుకు తెలపడం వెనుక ఉన్న అంతరార్థం ఏంటని ఆయన నిలదీశారు. అసలు నీట్ పేపర్ లీక్ చేసింది సంజీవ్ ముఖియా కాకపోతే ఇంకెవరని ప్రశ్నించారు. కీలక నిందితులపై సరైన ఆధారాలు సమర్పించనప్పుడు ఇక ప్రతిపాదిత ఫాస్ట్ ట్రాక్ కోర్టుల వల్ల దేశానికి వచ్చే ప్రయోజనం ఏమిటని నిలదీస్తూ, ప్రభుత్వం పేపర్ లీక్ మాఫియాను కాపాడుతోందని ఆరోపించారు.
పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం నిరాటంకంగా సాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. 26 రోజులకు పైగా సాగిన సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష విరమణపై ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, దేశానికి ఆయన ప్రాణం ఎంతో విలువైనదన్నారు. తమ డిమాండ్ల విషయంలో తగ్గేదే లేదని, మంత్రి రాజీనామా చేసే వరకు జంతర్ మంతర్ వేదికను వదిలి వెళ్లేది లేదని తెగేసి చెప్పారు.
కేంద్ర ప్రభుత్వంతో జరగబోయే చర్చలకు సంబంధించి తమ పార్టీ వైఖరిని సీజేపీ ప్రతినిధులు పునరుద్ఘాటించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదనలు వచ్చినా చర్చలు కేవలం ఒక తటస్థ వేదికపైనే జరగాలని సీజేపీ అధికార ప్రతినిధి దీపక్ బలియాన్ స్పష్టం చేశారు. మరోవైపు, శుక్రవారం రాత్రి తమ పార్టీ కీలక బృంద సభ్యులను పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందని అభిజీత్ దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు. తమను అరెస్టు చేసినప్పటికీ దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ఈ ఉద్యమాన్ని ముమ్మరంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
నీట్ లీకేజీ వివాదం కేవలం రాజధాని ఢిల్లీకే పరిమితం కాకుండా దక్షిణాదికీ వ్యాపించింది. తమిళనాడు రాజధాని చెన్నైలో నీట్ రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులు శుక్రవారం బాలన్ ఇల్లం వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో తమిళనాడు వ్యాప్తంగా నీట్ రద్దు డిమాండ్ మరోసారి తీవ్రరూపం దాల్చింది. దేశంలో యువత మేల్కొన్నారని, ఇకపై అబద్ధపు హామీలతో వారిని మోసం చేయడం సాధ్యం కాదని నేతలు హెచ్చరించారు.

# బాన్సువాడలో భక్తి వెల్లువ...



- పోచారం నివాసంలో ఘనంగా శ్రీ రామ నామస్మరణ గురు వందనం
- శ్రీ సద్గురు స్వామి సమర్థ మహారాజ్ ఆశీస్సులతో ఆధ్యాత్మిక వాతావరణం
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు, ప్రజాప్రతినిధులు,నాయకులు

**బాన్సువాడ, జూలై 24 (డీడీ9 వార్త):**

బాన్సువాడ పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి నివాసంలో గురువారం సాయంత్రం ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడింది.శ్రీ సద్గురు స్వామి సమర్థ మహారాజ్ గారిచే నిర్వహించిన శ్రీ రామ నామస్మరణ గురు వందనం కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది.శ్రీరామ నామస్మరణ,గురు వందనం ,భజనలు,ఆశీర్వచనాలతో పోచారం నివాసం భక్తి పారవశ్యానికి నిలయంగా మారింది.
కార్యక్రమానికి హాజరైన భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీరామ నామాన్ని జపిస్తూ, సద్గురు స్వామి సమర్థ మహారాజ్ వారి ఆశీస్సులు పొందారు.
వేదమంత్రోచ్చారణల నడుమ జరిగిన ప్రత్యేక పూజలు,గురు వందనం కార్యక్రమం ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది.సద్గురు మహారాజ్ భక్తి,గురుసేవ,ధర్మాచరణ,భగవన్నామ స్మరణ గొప్పతనాన్ని వివరిస్తూ అందరికీ ఆశీర్వచనాలు అందించారు.ఈ పవిత్ర కార్యక్రమంలో పోచారం కుటుంబ సభ్యులు పోచారం శంభు రెడ్డి - ప్రేమల దంపతులు,మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి - సోని రెడ్డి దంపతులు,నాయకులు శ్రీ పోచారం సురేందర్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని సద్గురు ఆశీస్సులు పొందారు.
అదేవిధంగా బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు,వివిధ గ్రామాల నాయకులు,పార్టీ కార్యకర్తలు,మహిళలు,యువకులు,పెద్ద సంఖ్యలో శ్రీ సద్గురు స్వామి సమర్థ మహారాజ్ భక్తులు కార్యక్రమానికి హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. భక్తుల రాకతో పోచారం నివాసం ఆధ్యాత్మిక క్షేత్రాన్ని తలపించింది.కార్యక్రమంలో శ్రీరామ నామసంకీర్తన, భజనలు,గురు వందనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సద్గురు స్వామి సమర్థ మహారాజ్ భక్తులను ఆశీర్వదించి,సమాజంలో శాంతి, ఐక్యత,ధర్మబద్ధమైన జీవనం, మానవీయ విలువలు మరింత బలపడాలని ఆకాంక్షించారు.శ్రీరామ నామ స్మరణతో ప్రతి ఇంటా సుఖశాంతులు నెలకొనాలని ఆశీర్వచనాలు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సద్గురువుల ఆశీస్సులు ప్రజలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.భక్తి, సేవ, సంస్కృతి,సనాతన ధర్మ పరిరక్షణలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని,రాష్ట్రంలో సుభిక్షం నెలకొనాలని ప్రార్థించినట్లు తెలిపారు.కార్యక్రమానికి హాజరైన భక్తులు సద్గురు స్వామి సమర్థ మహారాజ్ ఆశీస్సులు పొందడం తమ జీవితంలో ఒక అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిగా అభివర్ణించారు.భక్తిశ్రద్ధల మధ్య జరిగిన ఈ కార్యక్రమం బాన్సువాడ పట్టణంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వేడుకగా నిలిచచింది.

# ఎల్‌నినో నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణపై విస్తృత అవగాహన కల్పించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డిడి9 వార్త):**



ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, రైతులకు అందించాల్సిన సాంకేతిక సూచనలు, ఎరువుల లభ్యత, ఈపీఓఎస్ స్టాక్ నిర్వహణ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు.వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపేలా జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో రైతు సమావేశాలు, అవగాహన సదస్సులు, క్షేత్రస్థాయి ప్రదర్శనల ద్వారా వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన పంటలు, శాస్త్రీయ సాగు పద్ధతులు, నీటి వినియోగాన్ని తగ్గించే సాంకేతికతలపై రైతులకు పూర్తి సమాచారం అందించాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు.ఎరువుల లభ్యతపై సమీక్షిస్తూ, ఈపీఓఎస్‌లో పెండింగ్‌లో ఉన్న స్టాక్ వివరాలను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఎరువుల విక్రయ కేంద్రాలు, సహకార సంఘాల్లో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో వెంటనే నిర్ధారించి (కన్‌ఫర్మ్) అప్డేట్ చేయాలని తెలిపారు. దీంతో రైతులు సమీప కేంద్రాల్లో ఎరువుల లభ్యతను తెలుసుకుని సులభంగా బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌లోని స్టాక్, ఈపీఓఎస్‌లో నమోదైన స్టాక్, భౌతికంగా ఉన్న గ్రౌండ్ స్టాక్ మూడు పూర్తిగా సరిపోలేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏవైనా వ్యత్యాసాలు ఉంటే వెంటనే సరిచేసి రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేలా ముందస్తు ప్రణాళికతో రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాబా యజమానులకు ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిక

- రోడ్డుపై వాహనాలు పార్క్ చేస్తే చర్యలు
- ధాబాల్లో మద్యం, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలకు నో

**డిడి 9 వార్త గుడిహత్నూర్:**

జిల్లా వ్యాప్తంగా జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులపై ఉన్న ధాబా యజమానులు, నిర్వాహకులతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా గుడిహత్నూర్ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డుపై లారీలు, ఇతర వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత ధాబా యజమానులదేనని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు.ధాబాల్లో మద్యం సేవించడం, మద్యం విక్రయించడం, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం లేదా అమ్మకం వంటి అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత యజమానులు, నిర్వాహకులపై కేసులు నమోదు చేసి అవసరమైతే ధాబాలను తాత్కాలికంగా సీజ్ చేస్తామని తెలిపారు.ప్రతి ధాబాలో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ధాబాకు వచ్చే వాహనాలు కేవలం పార్కింగ్ స్థలాల్లోనే నిలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డుపై వాహనాల పార్కింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని ఆదేశించారు.అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులు, ఆయుధాలు, గంజాయి లేదామాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఉట్నూరు ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టె ఐపీఎస్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఇచ్చోడ ఎస్‌హెచ్‌వో కె. నరేష్ కుమార్, ఎస్ఐ ఎల్. శ్రీకాంత్, ధాబా యజమానులు, నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.






# వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ఆదిలాబాద్ బ్యూరో : (డిడి 9 వార్త న్యూస్ )**

వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల వర్షాకాలం లో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ తీవ్ర అప్రమత్తంగా ఉండాలని వైద్య అధికారి నవీన్ రెడ్డి అన్నారు జాతర్ల వసతి గృహం లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు మందులను అందించారు.అనంతరం డ్రైడే కార్యక్రమం భాగంగా పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడం, కలుషిత నీరు మరియు దోమల పెరుగుదల వల్ల పలు రకాల ఇన్ఫెక్షన్లు వేగంగా వ్యాపించే అవకాశం ఉందని అన్నారు .ముఖ్యంగా వ్యాపించే వ్యాధులు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా. టైఫాయిడ్, కలరా, కామెర్లు (జాండీస్), గ్యాస్ట్రోఎంటరైటిస్. వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు వస్తాయని కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులను నివారించడానికి ఎప్పటికప్పుడు కాచి చల్లార్చిన మంచి నీటిని మాత్రమే తాగాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పాత టైర్లు, కొబ్బరి బొోబ్బలు, కూలర్లలో నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలి. ఈగలు మూగిన, నిల్వ ఉన్న మరియు ఈరుగా ఉన్న వీధి ఆహారాన్ని తినకూడదు. వేడిగా ఉన్న తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి.జ్వరం, ఒళ్ళు నొప్పులు, వాంతులు లేదా నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని లేదా వైద్యుడిని సంప్రదించాలి. సొంతంగా మెడికల్ షాపుల్లో మందులు వాడకూడదు. వర్షాకాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు మరియు గర్భిణులు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే సీజనల్ జ్వరాల నుండి త్వరగా కోలుకోవచ్చుఅని తెలిపారు ఈ కార్యక్రమం హెచ్. ఈవో సూర్యప్రకాష్ ఎం ఎల్ హెచ్ పి రావలి,ఏ. ఎన్ ఎం అర్చన, , ఆశలు పాల్గొన్నారు







# బీర్కూర్‌లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**బాన్సువాడ, జూలై 24(డిడి9 వార్త):**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీర్కూర్ మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ అరిగే ధర్మతేజ మాట్లాడుతూ,తెలంగాణ అభివృద్ధిలో కేటీఆర్ పాత్ర విశేషమని,ఆయన ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు ,యువజన నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీట్ విద్యార్థులకు సంఘీభావంగా కామారెడ్డిలో కొవ్వొత్తుల ప్రదర్శన

- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డీసీసీ ఏలే మల్లికార్జున్ డిమాండ్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డీడీ9 వార్త):**




నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని, దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపడుతున్న ఉద్యమాలకు సంఘీభావం ప్రకటిస్తూ కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జూలై 25 శనివారం సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ తెలిపారు.నీట్ విద్యార్థులకు సంఘీభావంగా కామారెడ్డిలో కొవ్వొత్తుల ప్రదర్శనఏఐసీసీ ఆదేశాలు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.అదేవిధంగా,ఈ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రతిపక్ష నాయకులపై జరుగుతున్న చర్యలను తీవ్రంగా ఖండించింది.జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ కార్యకర్తలు, విద్యార్థులు, యువత, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పిలుపునిచ్చారు.
విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తు నీట్ బాధిత విద్యార్థులకు న్యాయం జరగాలి అనే నినాదాలతో ఈ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.



## క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10న జైల్ భరో విజయవంతం చేయాలి

- **కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై సీఐటీయూ, రైతు సంఘాల ఆగ్రహం**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డిడి9 వార్త):**

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన, వృత్తిదారుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక, వృత్తిదారుల, గిరిజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

కామారెడ్డి పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ పాల్గొని మాట్లాడారు.వక్తలు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు ఎన్నో దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తూ లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తోందని ఆరోపించారు. కనీస వేతనాల హామీ, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమంపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా పథకాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. వ్యవసాయ రంగంలో విదేశీ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు పెరిగి, దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. పత్తిపై దిగుమతి సుంకం తగ్గించడం వల్ల మార్కెట్‌లో పత్తి ధరలు క్షీణించి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తోందని, రాష్ట్రాలపై అధిక ఆర్థిక భారం మోపే విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. అలాగే విద్యుత్ సవరణ చట్టం ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రైతులపై అదనపు భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, వృత్తిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త నరసింహులు, కార్యదర్శి బి. వెంకటి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దశరథ్, సీఐటీయూ జిల్లా నాయకులు రాజనర్సు, పట్టణ నాయకులు నర్సింగరావు, ప్రభు, సంతు, దీవెన, శివ, రాజవ్వ, ఇందిరా, ఏ. రాజు, సంతోష్, అబ్బాస్, కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.



## పిట్లంలో ఈవెంట్ ఎలక్ట్రిక్ స్కూటర్స్ షోరూమ్ ప్రారంభం

- **నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న తోట అర్చన**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డిడి9 వార్త):**



కామారెడ్డి జిల్లా పిట్లం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈవెంట్ ఎలక్ట్రిక్ స్కూటర్స్ షోరూమ్ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సతీమణి తోట అర్చన శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా షోరూమ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడం కాలానుగుణ అవసరమని పేర్కొన్నారు.అనంతరం పిట్లం పట్టణానికి చెందిన సంజీవ్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో అర్హులైన పేద కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకుంటుండటం ఆనందదాయకమని అన్నారు.ఈ కార్యక్రమాల్లో కామారెడ్డి డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, పిట్లం ఏఎంసీ చైర్మన్ మనోజ్, సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బాన్సువాడలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

- **నిట్ పేపర్ లీక్ దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**

**బాన్సువాడ, జూలై 24(డిడి9 వార్త):**

నిట్ పేపర్ లీక్ ఘటనకు నిరసనగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన విద్యాసంస్థల బంద్‌లో భాగంగా బాన్సువాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల,ఎస్ఆర్ఎన్కే డిగ్రీ & పీజీ కళాశాల,నర్సింగ్ కళాశాలలతో పాటు పలు విద్యాసంస్థల్లో బంద్ విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని పీడీఎస్ఎఫ్, డీఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్యుఐ, ఎస్ఎఫ్ఐ, టీఆర్ఎస్వీ కాక్రోజ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. బాల్‌రాజ్ మాట్లాడుతూ, నిట్ పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని కోరారు.

ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన నిరసన ర్యాలీపై టియర్ గ్యాస్, లాఠీచార్జ్ వంటి చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు.విద్యార్థులపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ, విద్యను కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ నుంచి కాపాడాలని, విద్యాశాఖకు తగిన నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించిన ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు విద్యార్థి సంఘాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీడీఎస్ఎఫ్ నాయకులు సాయికుమార్, డీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీవన్ రాథోడ్, పవన్, ఎన్ఎస్యుఐ నాయకులు అర్ఫాత్, నవీన్, కాక్రోజ్ విద్యార్థి సంఘం నాయకుడు మూడ్ వినోద్, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, శివ, నవీన్, టీఆర్ఎస్వీ నాయకులు స్వరాజ్, అల్తామస్ తదితరులు పాల్గొన్నారు.







## మొక్కలు నాటడమే కాదు.. పరిరక్షణ బాధ్యతా మనదే

**నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**

కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జమున మహేష్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ఎంత ఉత్సాహంగా ప్రారంభిస్తామో, వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచడంలోనూ ప్రతి ఒక్కరూ అంతే శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆమె గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూమేశ్వర్, కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు రమేష్, రాజు, శేఖర్, శ్రీనివాస్, భారతి, మహిళా సంఘాల సీఏలు రుచిత, భాగ్యలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం..

- **యువత సేవా స్ఫూర్తికి నిదర్శనం**

**బాన్సువాడ, జూలై 24(డిడి9 వార్త):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బాన్సువాడలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమం సేవా భావానికి ప్రతీకగా నిలిచింది.ఈ సందర్భంగా కనిగిరి విఠల్, షేక్ అజీమ్ స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ జిల్లా అధ్యక్షుడు అంజి రెడ్డి, దామరంచ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆదాం పటేల్,అంజయ్య, వార్డు సభ్యుడు సాయిలు,షేక్ అబ్దుల్, ఆంజనేయులు, మేతరి శంకర్ తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,రక్తదానం మహాదానమని, ఒక్క యూనిట్ రక్తం ఎంతోమంది ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని మానవత్వాన్ని చాటాలని పిలుపునిచ్చారు. కేటీఆర్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని వారు అన్నారు.





## కొడిచర్ల గ్రామంలో వర్షాలు బాగా కురవాలని బొరడి పోచమ్మ వద్ద పూజలు నిర్వహిస్తున్న ఆడపడుచులు

**పోతంగల్ / కోటగిరి జులై 24/(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో కొడచర్ల గ్రామంలో బొరడీ పోచమ్మ గ్రామ దేవతలకు నవిద్యాలు పూజలు ప్రసాదాలు నిర్వహిస్తూ గ్రామంలో వర్షాలు పడి మంచిగా పంటలు పండాలని దేవతలకు పూజలు చేస్తూ వనదేవుని కి వర్షాలు బాగా కురవాలని ప్రసాదాలు స్వీకరిస్తూ ఆయుష్య ఆరోగ్యాలుగా ఉండాలని గ్రామదేవతల కు కోరుతున్న రైతులు ప్రజలు సుఖ సంతోషాలతో ప్రజలను కాపాడాలని బొరడి పోచమ్మ దేవతను కోరుతున్నారు ఎల్లినో ప్రభావం తొలగిపోవాలని మహిళలు పూజలు చేస్తూ దేవదేవతలను ప్రజలు కోరుతూ దేవతల యొక్క పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా మండలి సంఘాలు



గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ మండే కవిత అందరూ పాల్గొని ఈ పూజలు పునస్కారాలు విజయవంతంగా నిర్వహించుకున్నారు




## కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా స్కూల్ హాస్పిటల్ లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు

**పోతంగల్ /కోటగిరి/ జులై 24 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ కోటగిరి ఉమ్మడి మండలాల్లో శుక్రవారం రోజున కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఎం ఏ హకీమ్,సూదం నవీన్ ఇరువురు కలిసి పలు సేవా కార్యక్రమాలు చేశారు పోతంగల్ కోటగిరి ఉమ్మడి మండల ప్రజల తరఫున కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ఎం ఏ హకీమ్ మాట్లాడుతూ ఈ పండగ వాతావరణం లో ఈ జన్మదినం చాలా ఘనంగా జరపాలి అన్నదాన కార్యక్రమం నిర్వహించాలి అనుకున్నాం కానీ దుర దృష్టవషత్తు ఏమిటంటే నిట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో విద్యార్థులు తిరగబడటం బ్రిటిష్ వాళ్ళు కూడా మన బాధితులకు అలాంటి దెబ్బలు కానీ వాళ్ల మీద గ్యాస్ విడవడం కానీ చేయలేదు ఇప్పుడు ఈ ప్రభుత్వం విద్యార్థుల పైన నీచాతి నీచంగా వారిపైన ఫైరింగ్ చేసి ఎంతోమంది విద్యార్థులకు ఆడవాళ్లు అని కూడా చూడకుండా దేశ సైనికులు దేశాన్ని సేవ చేసే సైనికులు కూడా లాటి ఛార్జ్ చేసి నానా చిత్రహింసలు చేశారు అది చూస్తుంటే ఇలాంటి పరిస్థితి చూసి మన ప్రియతమ నాయకులు కేటీఆర్ స్పందించి భారతదేశంలోనే విద్యార్థులు సంతోషంగా లేనప్పుడు నా పుట్టినరోజు ఎందుకు ఘనంగా చేస్తారూ అని చెప్పడం ద్వారా ఇట్టి కార్యక్రమం సేవా భావం అటువంటిది ఉదయం ప్రభుత్వ ప్రైమరీ స్కూల్లో ఉర్దూ మీడియం స్కూల్ లో పండ్లు బిస్కెట్లు విద్యార్థులకు పంపిణీ చేయడం ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు పండ్లు బ్రెడ్ పాలు పంపిణీ చేయడం కంటి ఆపరేషన్ చేయించుకున్న కన్నం హనుమంతుకు 5000 ఆర్థిక సహాయం అందజేశారు అదేవిధంగా పేద కుటుంబం మొదటి కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే తాత కానుకగా 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేస్తామని ఎం ఏ హకీమ్ చెప్పారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం ఏ హకీమ్, మండల అధ్యక్షుడు సూదం నవీన్, ఆరిఫ్ బేగ్, కోమటి గంగాధర్, హనుమంతు,సురేష్, పట్నం సాయిలు, చిక్య నాయక్, రాములు, రవి, ఉమర్ఖాన్, అఫ్రోజ్, బీమ్ రావ్, సాయిలు, జలాల్ ,ఆఫీస్, ఇమామ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## జల్లపల్లి పాత గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో నేరాల నియంత్రణపై విస్తృత అవగాహన సదస్సు

**పోతంగల్/కోటగిరి, జూలై 24 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల పరిధిలోని జల్లపల్లి పాత గ్రామంలో కోటగిరి పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు నేరాల నియంత్రణ, చట్టాలపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు సాంకేతికత, సైబర్ నేరాల పట్ల మరియు అపరిచిత వ్యక్తుల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే తక్షణమే పోలీసులకు చేరవేయాలన్నారు. గ్రామంలో పూర్తి ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామస్తులు, యువత పోలీసు శాఖకు ఎల్లప్పుడూ సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ అవగాహన సదస్సులో గ్రామ సర్పంచ్ సుంకు లత, ఉప సర్పంచ్ ఎం.డి. సికందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలి

- **రైతులకు పూర్తి మద్దతు అందించాలి: సీఎస్ సంజయ్ జాజు**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డిడి9 వార్త):**






రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు అందించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి ఎల్ నినో పరిస్థితులు, పంటల వైవిధ్యీకరణ, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై వివిధ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ధోరణులను దృష్టిలో ఉంచుకుని సుమారు 30 లక్షల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికలను జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. వాతావరణ శాఖ అంచనాలు నిజమవుతున్న నేపథ్యంలో ఆలస్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.రైతుల వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు *కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)*పై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. వరి మాత్రమే కాకుండా పత్తి సహా దాదాపు 20 పంటలకు ఎంఎస్పీ అమలులో ఉందని, మార్కెట్ ధర ఎంఎస్పీ కంటే తగ్గితే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు స్పష్టంగా వివరించాలని ఆదేశించారు.ప్రత్యామ్నాయ పంటల వల్ల ఆదాయం తగ్గదని, కొన్ని సందర్భాల్లో మరింత లాభం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్న సీఎస్,కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు.అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే అమలు చేయాలని, రిజర్వాయర్లలో నీటి నిల్వలు కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమీక్ష**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థికి వెంటనే ఒక జత యూనిఫాం అందించి, ఆగస్టు 30లోగా రెండు జతల యూనిఫాంల పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. వస్త్రాల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులకు పంటల మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల లాభాలు, కనీస మద్దతు ధర లభించే పంటలు, కూరగాయల సాగుపై రైతు వేదికలు, రైతు వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం, ప్రస్తుత సంవత్సరం పంటల సాగు విస్తీర్ణంపై సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ దామోదర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కేజీబీవీ, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జనగణన సంచాలకుల కార్యాలయం సంయుక్త సంచాలకులు

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డిడి9 వార్త):**

జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీకి సంబంధించిన శిక్షణ కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా, జనగణన సంచాలకుల కార్యాలయం, హైదరాబాద్‌కు చెందిన సంయుక్త సంచాలకులు జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీలో ఖచ్చితత్వం, నాణ్యత, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. శిక్షణలో అందించే మార్గదర్శకాలను క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిగా అవగాహన చేసుకుని, సమాచార సేకరణ, డేటా నమోదు తదితర ప్రక్రియలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీకి సంబంధించిన క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం జూలై 24 నుంచి ఆగస్టు 4 వరకు షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనగణన సంచాలకుల కార్యాలయం, హైదరాబాద్‌కు చెందిన అధికారులు డి.వి. రమణ, రాజేశ్వర్, సీపీఓ రఘునందన్, సూపరింటెండెంట్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నీటి నిల్వ పనులకు భూమిపూజ

**నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**

భీమ్‌గల్ మండల పరిధిలోని మెండోరా, దేవనపల్లి, పురాణిపేట గ్రామాల్లో 'తెలంగాణకు జలసిరి' కార్యక్రమంలో భాగంగా ఉచిత నీటి నిల్వ పనులకు భీంగల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపునకు ప్రజలంతా నీటి నిల్వ పనులపై ప్రత్యేక ఆసక్తి చూపాలని కోరారు. ఈ పథకం కింద ప్రతి ఇంటికీ వ్యక్తిగత ఇంకుడు గుంతలు, ఎక్కువ నీరు నిల్వ ఉండే ఉమ్మడి ప్రాంతాలలో సామూహిక ఇంకుడు గుంతలు, అలాగే రైతుల పొలాలలో నీటి నిల్వ కుంటలను ఉచితంగా నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. ఈ పనులపై ఆసక్తి గల రైతులు, ప్రజలు తమ గ్రామ పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ భూమిపూజ కార్యక్రమాలలో ఉపాధి హామీ పథకం సహాయ నిధుల అధికారి జీ.నరసయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



## జైతాపూర్‌లో డీఆర్డీవో పీడీ సాయన్న ఆకస్మిక పర్యటన

**బోధన్, నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**

ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో డీఆర్డీవో పీడీ సాయన్న శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ అందుతున్న వసతులను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను గ్రామ సర్పంచ్ నాగుల రాజుగౌడ్ పీడీ సాయన్న దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కోసం పీఈటీ ఉపాధ్యాయుడిని నియమించాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచాలని కోరారు. ఉపాధ్యాయులు ఇంగ్లీషులో బోధించడంతో పాటు విద్యార్థులు కూడా ఇంగ్లీష్‌లోనే మాట్లాడేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రభుత్వం అందించే యూనిఫాంలలో విద్యార్థులకు సరిపోయే కొలతల దుస్తులు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం



గ్రామంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అంగన్వాడి భవనం, మహిళా భవనం, పల్లె ప్రకృతి నర్సరీతో పాటు చేపట్టిన పారిశుధ్య పనులను తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఉన్నారు.



## భీంగల్‌లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు..

- **మొక్కలు నాటిన బీఆర్ఎస్ శ్రేణులు**

**నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**

భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని భీంగల్ పట్టణంలోని 5వ వార్డులో పార్టీ నాయకులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై తమ బాధ్యతను చాటుకున్నారు. మాజీ మంత్రి, బాల్కొండ నియోజకవర్గ శాసన సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఎలాంటి ఆర్భాటాలు లేకుండా కేవలం సేవా కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇస్తూ ఈ హరిత కార్యక్రమాన్ని చేపట్టారు. పచ్చదనాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని, కేటీఆర్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటడం ద్వారా సమాజానికి మంచి పర్యావరణ సందేశం ఇస్తున్నామని నాయకులు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్ద వృక్షాలుగా పెంచాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆర్మూర్ మహేష్, పూర్వ వైస్ చైర్మన్ గున్నాల బాల భగత్, కౌన్సిలర్ బోదిరి లావణ్య నర్సయ్యలు పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన నాయకత్వంలో తెలంగాణ మరింత ప్రగతి పథంలో దూసుకుపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు రాజ్ నాయక్, కర్నే రాజేశ్వర్, శెవ్వ కృష్ణ, బోదిరి సుమన్, గొల్లపల్లి సురేష్, శెవ్వ రాజేశ్వర్, మహేందర్, నరేష్, గంగాధర్, అరవింద్ తదితర బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాళేశ్వరం–మంజీరా ఎల్ఐఎస్ భూసేకరణ వేగవంతం చేయాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- **శాఖల సమన్వయంతో ప్రాజెక్టుల అమలు పూర్తి చేయాలని ఆదేశం**
- **భూ యజమానుల సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలని సూచన**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డిడి9 వార్త):**



కామారెడ్డి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు, మంజీరా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఎల్ఐఎస్) పరిధిలో కొనసాగుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేసి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి దశను సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

భూ యజమానుల సమస్యలను చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించాలని, పరిహారం చెల్లింపులను నిబంధనల మేరకు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టు పనులకు ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేసి, రైతులకు సాగునీటి ప్రయోజనాలు త్వరగా అందేలా కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, కామారెడ్డి ఆర్డీవో, భూసేకరణ సూపరింటెండెంట్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## హెగ్డోలి, సాలూర, ఖాజాపూర్‌లో వ్యవసాయ విద్యార్థినుల గ్రామీణ సర్వే..

- **వర్షా భావ పరిస్థితులపై రైతులకు శాస్త్రవేత్తల శిక్షణ**

**పోతంగల్/కోటగిరి, జూలై 24 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల పరిధిలోని హెగ్డోలి, సాలూర, ఖాజాపూర్ గ్రామాల్లో జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా సందడి చేశారు. రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో 'సహభాగస్వామ్య గ్రామీణ స్థితిగతుల అంచనా' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.గ్రామ వనరులపై సమగ్ర పరిశీలన:స్థానిక రైతులు, ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ వ్యవసాయ పరిస్థితులు, నీటి వనరులు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అంచనా వేసేందుకు ఈ వినూత్న పద్ధతిని చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థినులు గ్రామాల్లో పర్యటించి.. పంటల సరళి, లభ్యమవుతున్న వనరుల వివరాలను విశ్లేషించారు. అనంతరం ఆయా గ్రామాల వ్యవసాయ ముఖచిత్రాన్ని (నమూనా చిత్రాలను) నేలపై గీసి రైతులకు స్పష్టంగా ప్రదర్శించి అవగాహన కల్పించారు.వాతావరణ మార్పుల ముప్పు ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం:ఈ సందర్భంగా రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా.కె. ఇందుధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ మార్పులు (వర్షాభావ పరిస్థితుల) తరుణంలో రైతులు సాంప్రదాయ సాగు పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. నీటి ఎద్దడిని తట్టుకునేందుకు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే మొక్కజొన్న, కంది, సోయాచిక్కుడు, పెసర, మినుము వంటి ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు.వరి సాగులో శాస్త్రవేత్తల కీలక సూచనలు:తడిపొడి పద్ధతి: వరి సాగు చేసే రైతులు నీటి వృధాను అరికట్టేందుకు 'మార్పిడి తడిపొడి' పద్ధతిని పాటించాలి. పొలంలో నీటిని తరచుగా తీస్తూ, మళ్లీ పెడుతూ సాగు చేయాలి.నారు నాటడం: ఒకవేళ 35 రోజులు పైబడిన ముదురు నారు వేయాల్సి వస్తే, ప్రతి కుదురుకు తప్పనిసరిగా 4 నుంచి 5 పిలకలు ఉండేలా చూసుకోవాలి.ఎరువుల నియంత్రణ: వరిలో రసాయన ఎరువుల వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలని స్పష్టం చేశారు.ఈ నూతన వ్యవసాయ శిక్షణా కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డా.కె. ఇందుధర్ రెడ్డితో పాటు హెగ్డోలి, సాలూర, ఖాజాపూర్ గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు, జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవత్వానికి మారుపేరుగా నిలిచిన అరవింద్ అన్న, రవి అన్న యువసేన

- **మాజీ ట్రాక్టర్ డ్రైవర్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం...**

**కోటగిరి/ పోతంగల్ /జూలై 24/(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో మానవత్వం, సేవాభావం కలిగిన నాయకులుగా తెల్ల అరవింద్ అన్న, రవి అన్నలు మరోసారి తమ గొప్ప మనసును చాటుకున్నారు. గతంలో తమ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసిన నారాయణ గారు ఆకస్మికంగా మృతి చెందారనే విషయం తెలుసుకున్న అరవింద్ అన్న వెంటనే స్పందించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా నారాయణతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంత్యక్రియల ఖర్చుల కోసం మానవతా దృక్పథంతో రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

గతంలో తమ వద్ద పనిచేసిన నారాయణ సేవలను గుర్తు చేసుకుని, ఆయన కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలిచిన అరవింద్ అన్న, రవి అన్నల సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభినందించారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, మానవత్వాన్ని చాటుతున్న అరవింద్ అన్న, రవి అన్నలకు హృదయపూర్వక వందనాలు. వారి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



## బషీరాబాద్‌లో 11వ వార్డులో నూతన బోరుబావి ప్రారంభం

**నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**

కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో గత కొంతకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు పాలకవర్గం శాశ్వత పరిష్కారం చూపింది. వార్డులోని పాత బోరుబావిలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని గుర్తించిన పాలకవర్గం ప్రత్యేక తీర్మానం చేసి, అత్యవసరంగా నూతన బోరు బావిని తవ్వించింది. తమ నీటి సమస్యను త్వరితగతిన తీర్చినందుకు కాలనీవాసులు పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జమున మహేష్, ఉప సర్పంచ్ భూమేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు రమేష్, రాజు, శేఖర్, రవి, లక్ష్మి, భారతి పురుషోత్తం, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ ఎం. శ్రీనివాస్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డిడి9 వార్త):**



జిల్లా వైద్య ఆరోగ్య సేవల సమన్వయకర్త తో పాటు బాన్సువాడ ఏరియా ఆసుపత్రి, మాతాశిశు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం. శ్రీనివాస్ శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎం. శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో పని చేస్తామని తెలిపారు. ప్రజారోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలను సమిష్టిగా ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## 40 ఏళ్ల నిరీక్షణకు తెర.. పోచారం –పెద్దకొడపగల్
# బస్సు సర్వీస్ ప్రారంభం

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డిడి9 వార్త):**

పోచారం గ్రామ ప్రజలు దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రవాణా సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. బాన్స్వాడ డివిజన్ డీఎం సమన్వయంతో పోచారం గ్రామం నుంచి పెద్దకొడపగల్ మండల కేంద్రానికి నూతన బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు.పోచారం గ్రామం నుంచి పెద్దకొడపగల్ వరకు సుమారు 16 కిలోమీటర్ల దూరం ఉండటంతో, ఇంతకాలం రవాణా సౌకర్యం లేక గ్రామ ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కొత్త బస్సు సర్వీస్ ప్రారంభంతో వారి ప్రయాణం సులభతరం కానుండటంతో పాటు విద్య, వైద్యం, ప్రభుత్వ కార్యాలయాల సేవలు పొందేందుకు కూడా అనుకూలంగా మారనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు పాల్గొని బస్సు సర్వీస్ ప్రారంభాన్ని స్వాగతించారు.గ్రామ ప్రజలు ఈ బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేసిన సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, గ్రామ అభివృద్ధికి ఇది కీలక ముందడుగు అని హర్షం వ్యక్తం చేశారు.

## మహిళా దివ్యాంగులకు అన్యాయం చేస్తే సహించేది లేదు

- **వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ**

**బోధన్, నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**



దివ్యాంగుల కమిషనర్ నియామకంపై ప్రభుత్వం మూడు రోజుల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రిటైర్ అయిన వ్యక్తిని ఈ పదవికి ఎంపిక చేస్తామనడం తీవ్రంగా బాధాకరమని, మహిళా దివ్యాంగులకు అన్యాయం జరగడం సహించలేమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులలో ఎంతో ఉన్నత చదువులు చదివిన మహిళలు ఉన్నారని, వారికి ఈ పదవి కేటాయిస్తే దివ్యాంగులకు నిజమైన న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. అన్ని రంగాలలో మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లుగానే.. ఎస్సీ మహిళలకు ప్రత్యేకంగా ఎస్సీ కమిషనర్‌ను కేటాయించిన విధంగానే, మహిళా దివ్యాంగులకు కూడా తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రత్యేకించి 101వ రాజ్యాంగ సవరణ చట్టం చేసిన తర్వాత కమిషన్, చైర్మన్ పదవుల గురించి ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో దివ్యాంగులు కూడా ఉన్నారని, వారు కూడా పౌర హక్కుల్లో సమానులేనని రాజ్యాంగం గుర్తించిందని గుర్తుచేశారు. సమాజంలో తమకూ ఒక విలువ, సముచిత స్థానం ఉందని ఈ ప్రభుత్వం గుర్తించి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మహిళా దివ్యాంగుల శక్తిని బలపరిచేలా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మణుగూరులో ఘనంగా నిర్వహించిన KTR జన్మదిన వేడుకలు..

- **పట్టణంలో పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించిన బిఆర్ ఎస్ నాయకులు.**

**మణుగూరు. జూలై 24(డి డి 9వార్త)**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 50 వ పుట్టినరోజు సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు.పట్టణంలో గల సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధితులకు పండ్లు, బ్రెడ్డు అందజేశారు. పినపాక నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు BRS వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామం నందు ఇటీవల రోడ్డు ప్రమాదం మరియు అనారోగ్య కారణంగా మరణించిన బట్ట ప్రశాంత్, మరియు బట్ట శ్రీను కుటుంబ సభ్యులకు 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని BRS పార్టీ జిల్లా యువజన నాయకులు పద్ధం శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమాలలో బిఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# మొక్కలు నాటడమే కాదు.. పరిరక్షణ కూడా అందరి బాధ్యత: ముకుంద్ రెడ్డి

- **రాఘవపూర్‌లో ఘనంగా వన మహోత్సవం.. 4 వేల ఈతమొక్కల నాటిన ఎక్సైజ్ అధికారి**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డిడి9 వార్త):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రాఘవపూర్ గ్రామంలో భారీ ఎత్తున ఈతమొక్కల నాటకం చేపట్టారు. జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి శ్రీ ముకుంద్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 4,000 ఈతమొక్కలను నాటారు. ఇందులో కామారెడ్డి సొసైటీ నెం.1 సభ్యులు 2,000, సొసైటీ నెం.2 సభ్యులు 2,000 ఈతమొక్కలను నాటి వన మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ, మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఈత, తాటి మొక్కలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు గీత కార్మికులకు స్థిరమైన జీవనోపాధిని కల్పిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి ఏపీవో అన్నపూర్ణ మాట్లాడుతూ, నాటిన ప్రతి మొక్క సంరక్షణ కోసం ప్రభుత్వం రూ.5 ప్రోత్సాహకంగా కేటాయిస్తోందని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినీల నరేష్,




ట్రైనింగ్ ఏఈఎస్ అరుణ్ చంద్ర, ఎక్సైజ్ సీఐలు సంపత్ కృష్ణ, సుందల్ సింగ్, ఎస్సైలు విక్రమ్ కుమార్, శ్రీనివాస్,రచన, పంచాయతీ కార్యదర్శి మాధవి, లత గౌడ సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, జీవన్ గౌడ్, చంద్ర గౌడ్, నారా గౌడ్, గోపి గౌడ్, శ్రీధర్ గౌడ్, రమేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అలాగే హెడ్ కానిస్టేబుళ్లు జాన్, ఫరీద్, కానిస్టేబుళ్లు మునావర్ గోరి, పవన్, బాబు, శరత్, దినేష్, అమృత్ రెడ్డి, రాజు, శంకర్, వందన, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలను విజయవంతం చేయాలి

- **అదనపు కలెక్టర్ భుజంగా రావు**

**బోధన్, నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**



రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు అధికారులు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ భుజంగా రావు స్పష్టం చేశారు. శుక్రవారం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో పుష్కర ఏర్పాట్ల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఘాట్‌ల అభివృద్ధి, తాగునీటి వసతి, పారిశుధ్యం, మెరుగైన రహదారులు, పరిశుభ్రత తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి పుష్కరాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బోధన్ రెవిన్యూ డివిజనల్ అధికారి విజయ కుమారి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు



## వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

- **జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి**

**బోధన్, నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**

ఎల్నినో ప్రభావం కారణంగా వరికి బదులు కంది, పెసర, మినుము వంటి ఆరుతడి పంటలు వేయవలసిందిగా జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి సూచించారు. ఎడపల్లి మండలంలోని రైతు వేదికలో శుక్రవారం వరికి బదులుగా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. వరి వేసుకున్న రైతులు జాగ్రత్తగా నీటిని పొదుపుగా వాడుకోవాలని హితవు పలికారు. నిజాంసాగర్ కెనాల్ నీరు త్రాగునీటికి మరియు పశువులకు మాత్రమే సరిపోతుందని, కాబట్టి పంటలకు ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. యూరియా మరియు ఇతర ఎరువుల వాడకం తగ్గించాలని చెప్పారు. జిల్లా ఉద్యానవన అధికారి నరసింహ మాట్లాడుతూ.. రైతులు కూరగాయలు వేసుకోవాలని సూచించారు. కూరగాయలకు సబ్సిడీపై విత్తనాలు మరియు డ్రిప్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి సొసైటీ చైర్మన్ మల్కా రెడ్డి, ఆత్మ చైర్మన్ కృష్ణారావు, గ్రామ సర్పంచ్ రాము శెట్టి, ఉప సర్పంచ్ గంగాధర్, జానకంపేట ఉపసర్పంచ్ నీలం కృష్ణ, వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్, ఏఈవో జ్యోతి, ఏఈవో శ్రీహరి, రైతులు కృష్ణారావు, రవి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డ్ శ్రీనివాస్ కుటుంబానికి ప్రభుత్వం అండ – ఎస్పీ భరోసా

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24(డిడి9 వార్త):**

ప్రమాదవశాత్తు మరణించిన హోంగార్డ్ శ్రీనివాస్ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని శ్రీనివాస్ సతీమణి బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, హోంగార్డ్ శ్రీనివాస్ కుటుంబానికి ప్రభుత్వం, పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ తరపున అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు.ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సాయం శ్రీనివాస్ కుటుంబానికి కొంత ఊరటనిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.






## ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి : ఏడీఏ బొబ్బా శ్రీనివాస్

**బోధన్, నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రసాయనాలకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలని బోధన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బొబ్బా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సాలూర మండల కేంద్రంలో రైతులకు ఎల్‌నినో ప్రభావం, జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ అంశాలపై శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో అధికంగా కనిపించే అవకాశం ఉందని, దీనివల్ల వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం, పొడి వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు వాతావరణ సూచనలను గమనిస్తూ తగిన పంటల యాజమాన్య చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఏవో శ్వేత మాట్లాడుతూ... జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ గురించి వివరిస్తూ.. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం ఈ మిషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. స్థానికంగా లభించే వనరులతో తక్కువ ఖర్చుతో సుస్థిర వ్యవసాయాన్ని అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఈ క్రమంలో రైతులు జీవామృతం, ఘన జీవామృతం, మల్చింగ్ వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విధిగా అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన సదస్సులో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇరు అంశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాలూర సర్పంచ్ లావణ్య, ఖాజాపూర్ సర్పంచ్ నాగయ్య, కొప్పర్తి క్యాంప్ సర్పంచ్ సతీష్, సాలూర వ్యవసాయ విస్తరణ అధికారులు ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.



## శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

- **బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు**

**బోధన్, నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త)**

గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు పిలుపునిచ్చారు. సాలూర మండలం కుమ్మన్‌పల్లి గ్రామంలో శుక్రవారం బోధన్ రూరల్ పోలీస్ ఆధ్వర్యంలో 'మన ఊరు – మన భద్రత – మన బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, అత్యవసర సమయాల్లో 'డయల్ 112' సేవలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. పాముకాటు, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, సర్పంచ్ శీలం మహేందర్ రెడ్డి, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది అనిరుద్ద్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



# దేశ ప్రధానమంత్రి మంత్రులదిష్టి బొమ్మలు ను తగలపెడుతున్నా సి ఐ ఎస్ ఐ స్పందించక పోవడం బాధాకరం

- **కాంగ్రెస్ నాయకుల ఆదివాసీ దళిత బహుజన వర్గాల ప్రజల అభివృద్ధి పై చిత్తశుద్ధి ఉంటే దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుండి మైదాన ప్రాంతానికి తరలించుకు పోవడం సరికాదు**
- **కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే బస్సు డిపో రెవిన్యూ డివిజన్ కొండాయి బ్రిడ్జి పూర్తి చెయ్యాలి డా జాడి రామరాజు నేత**

**డీ డీ 9 వార్త, ములుగు :**

జులై 24 శుక్రవారం రోజున ఏటూరునాగారం మండల కేంద్రం లో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రిదైన మంత్రులైన నాయకుల దిష్టి బొమ్మలు కాంగ్రెస్ పార్టీ నాయకులు తగలపెడుతుంటే సర్కిల్ ఇన్స్పెక్టర్ సబ్ ఇన్స్పెక్టర్ కాంగ్రెస్ కార్యకర్తలాగా చూస్తున్నారు. కానీ కాంగ్రెస్ నాయకులను నీవరించక పోవదానికి ప్రధాన కారణం ఏమిటో చెప్పాలని అన్నారు. ప్రభుత్వ అధికారులే కాంగ్రెస్ కార్యకర్తలు గా మంత్రి మెప్పుకోసం పని చేస్తే ప్రజలకు ఏమి న్యాయం చేస్తారో ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఆలోచించాలని అన్నారు. అదేవిదంగా కాంగ్రెస్ నాయకులకు ఆదివాసీ దళిత బహుజన మైనార్టీ వర్గాల రైతులఅభివృద్ధి పై చిత్తశుద్ధి ఉంటే దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుండి మైదాన ప్రాంతానికి నీళ్లు తీసుకెళ్తూ ఏజెన్సీ ప్రాంతాన్ని ఎడారిగా మారుస్తున్నా పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దిష్టి బొమ్మ తగలపెడితే బాగుండేది అన్నారు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల కు ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు రాహుల్ బాబా రేవోంతువోద్దీన్ దిష్టి బొమ్మలు తగలపెడితె బాగుండేది అన్నారు అదేవిదంగా నాటి ఎమ్మెల్యే నేటి తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఆదేశాల మేరకు అవినీతికె అంబాసిడర్ గా ఉన్నా డీసీసీ అధ్యక్షులు పైడుకుల అశోక్ ఆదేశాలు మేరకు ధర్నా చెయ్యడం బంద్ పెట్టి ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ బస్సు డిపో కొండాయి బ్రిడ్జి పూర్తి చెయ్యాలని చెయ్యండి కానీ మంత్రి మెప్పు కోసం ధర్నాలు చేసి ఏజెన్సీ ప్రాంతం ను ఎడారిగా మార్చడానికి ప్రయత్నం చెయ్యకండి అన్నారు అదేవిదంగా కాంగ్రెస్ నాయకులు అధికారం లో ఉండి పాఠశాలు బంద్ పెట్టి ప్రజలను విద్యార్థులను రెచ్చగొట్టి సాధించేది ఏమి లేదాని అన్నారు అదేవిదంగా ఏజెన్సీ ప్రాంత కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ బస్సు డిపో కొండాయి బ్రిడ్జి ఎప్పుడు పూర్తి చేస్తారో మైదాన ప్రాంతనాయకురాలు ములుగు ఇప్పటికైనా ఏటూరునాగారం మంగపేట తాడ్వాయి కన్నాయిగూడెం ప్రజలకు ఏటూరునాగారం కన్నాయిగూడెం మంగపేట



తాడ్వాయి వాజేడు వెంకటాపురం మండలం లోని అదివాసి దళిత బహుజన మైనార్టీ వర్గాల అభివృద్ధి పై మంత్రి ని నిల తియ్యండి అన్నారు అదేవిదంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్నా ధర్నాల ప్రజల ను నమ్మించి రాజకీయ లబ్ధి కోసం ధర్నా చేస్తున్నా కాంగ్రెస్ పార్టీ ని ఆదివాసీ దళిత బహుజన వర్గాల ప్రజలు అలోచించి భూస్థాపీతం చెయ్యాలని బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత అన్నారు.



# భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో డీఏవీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం..

- **బీటీపీఎస్ ప్లాంట్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క..**
- **ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, డాక్టర్ తెల్లం వెంకట్రావు, రాందాసు నాయక్ లు.**

**మణుగూరు.జూలై 24(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరులోని భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎస్) ఆవరణలో నూతనంగా నిర్మించిన డీఏవీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, వైరా శాసనసభ్యులు రాందాసు నాయక్ లు ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యతో పాటు నాణ్యమైన విద్యను అందించే ఆధునిక విద్యాసంస్థల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు అత్యుత్తమ విద్యను అందించడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
అనంతరం ప్రజాప్రతినిధులు పాఠశాల భవనం, తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, ఇతర ఆధునిక సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం, లక్ష్యాల గురించి తెలుసుకుని అభినందించారు. పాఠశాల యాజమాన్యం చేపట్టిన ఏర్పాట్లను ప్రశంసిస్తూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, వైరా ఎమ్మెల్యే రాందాసు నాయక్ లు బీటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను సందర్శించారు. ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తూ రాష్ట్ర విద్యుత్ అవసరాల తీర్చడంలో బీటీపీఎస్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీటీపీఎస్ ఉన్నతాధికారులు, డీఏవీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# కె.సి.ఆర్ చెక్కిన శిల్పం కల్వకుంట్ల తారక రామారావు..

- **కె టి.అర్ బర్త్ డే సందర్భంగా సింగరేణి హాస్పిటల్ లో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేసిన టి బి జి కె యస్ నాయకులు..**

**మణుగూరు.జూలై 24 (డి డి 9వార్త)**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ గొంతుకగా నిలిచి, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ దళంలో తొమ్మిదిన్నర ఏళ్ల పాటు మంత్రి గా పని చేసి తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని తన పనితీరుతో దేశానికి ఆదర్శంగా నిలిపిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 50 వ జన్మదిన వేడుకలను మణుగూరు ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సింగరేణి వైద్యశాలలో వైద్య చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మిక సంక్షేమం, హక్కుల సాధన కోసం ఆయన స్వరం కార్మిక గొంతుకగా పని చేస్తుందని తెలిపారు. ఆయన ఆలోచనలు మరెన్నో విజయాలకు నాంది పలకాలని ఆయన నాయకత్వం భావి తరాలకు దిక్సూచిగా నిలవాలని వారంత ఆకాంక్షించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వర రావు, సుద్దాల సంపత్ కుమార్,జంగం రాజ్ కుమార్, మస్తాన్, కమటం పరమేష్ కుమార్, సాంబార్ రాజ శేఖర్ పి కె నాగరాజు, అజ్మీరా అశోక్ కుమార్, కళ్యాన్ కుమార్,,రఘు,, ఇమ్రాన్, శ్రీహరి, ప్రవీణ్ కుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# రామగుండం ఏరియా అర్జీ 1లో క్వార్టర్ల కౌన్సిలింగ్ నిర్వహణ.

**డిడి9వార్త / రామగుండం జులై 25:**

రామగుండం ఏరియా 1లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల కోసం కేటగిరీ 1 క్వార్టర్ల కౌన్సిలింగ్ శుక్రవారం ఆర్.సి.ఓ.ఏ. క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్లు రవీందర్ రెడ్డి, తిరుపతి పాల్గొని కౌన్సిలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు.ఈ కౌన్సిలింగ్‌లో మొత్తం 318 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, 97 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 24 మంది తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకొని స్వీకరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షే



మానికి సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, క్వార్టర్ల కేటాయింపు పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు, పర్సనల్ విభాగ అధికారులు, సంక్షేమ విభాగం, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎం ఆర్ పి ఎస్, మరియు ఎన్ ఆర్ ఐ ల ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ల పంపిణి.

**డిడి9వార్త / రామగుండం జులై 25:**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఇంద్రనగర్ 46వ డివిజన్లో స్థానిక లక్ష్మీ శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో ఉదయం 12 గంటలకు ఎన్ ఆర్ ఐ లు చిలుముల సత్యమూర్తి, గొట్టేముక్కుల సతీష్‌రెడ్డి బి ఆర్ ఎస్,సెల్ యు కే,సీనియర్ నాయకులు మరియు బి ఆర్ ఎస్,నాయకులు చిలుముల రామ్మూర్తి సహకారంతో తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా పైన తెలిపిన ఎన్ ఆర్ ఐ,వారు సహకారంతో 46వ డివిజన్ మహిళలకు స్వయం ఉపాధి కింద కుట్టు మిషన్లు ఐదు లక్కీ డీప్ ద్వారా అందివ్వడం జరిగింది సందర్భం. కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ యొక్క వేదిక *పొన్నాల శ్రీనివాస్ అంబేద్కర్ సంగం 46వ డివిజన్ అధ్యక్షుని ఆధ్వర్యంలో జరిగింది లక్కీ డీద్ ద్వారా దివ్యాంగులు అయినటువంటి గాడి మరియకు కుట్టుమిషన్ ఇవ్వడం జరిగింది రెండో లక్కీ డీప్ గా గుండు సునీత మూడో లక్కీ డీప్ బొంత శివాని నాలుగో లకిడిప్ కింద రేష్మిక నాయక్ ఐదో బహుమతి ఉమ్మ శిరీషకు ఇవ్వడం జరిగింది.ఇట్టి వేదికలో పాల్గొన్న వారు దాదాపు 50 మంది మహిళలు మరియు డివిజన్ యువకులు పాల్గొన్నారు. పాల్గొన్నారు. ఈ వేదికలో ఏం ఆర్ పి ఎస్,కార్పొరేషన్ నాయకుడు గాడి మస్తాన్ ఏం ఆర్ పి ఎస్,రాష్ట్ర నాయకులు జెల్లంపల్లి శ్రీనివాస్ కాంపల్లి ఉమా శంకర్ మున్సిపల్ సర్వేరుగారు. సంటి నగేష్ . మరియు ఇట్టి వేదికకు సహకరించిన యువకులు పాల్గొన్నారు. కొంగర.సందీప్ సూర్య, పొన్నాల నవీన్ వంశీ, పొన్నాల గోపి శివన్ ,ఎస్ నిరంజన్, గాడి సురేష్ ముల్కల నరేష్, కాజీపేట సతీష్, జె వికాస్,ఎస్ విశ్వతేజ, నల్లాల అజయ్, ఎస్ భరత్, చల్ల చింటూ,జోగు చింటూ, సునోని అభి,కె. సృజన్. జే వివేక్,ఆవుల. సన్నీ, తదితరులు పాల్గొన్నారు.



# కేటీఆర్ జన్మదిన వేడుకల్లో వెల్లి విరిసిన సేవ స్ఫూర్తి..

- **చిన్నారి జాహ్నవి వైద్యానికి రూ20.000 వేలు ఆర్థిక సాయం..**
- **కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన వెంకటాపురం మండల BRS నాయకులు..**

**జూలై 24 డిడి9 వార్త వెంకటాపురం.**

తెలంగాణ ప్రజల అభిమాన నాయకులు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను వెంకటాపురం మండల కేంద్రంలోని R&B గెస్ట్‌హౌస్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.
బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోడవర్తి నర్సింహమూర్తి ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు గంప రాంబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని నాయకులు ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా భోన్ నర్వ్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి జాహ్నవి కుటుంబానికి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం వెంకటాపురం మండల బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.20,000 ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోసీనియర్ నాయకులు గోడవర్తి నర్సింహమూర్తి, మండల అధ్యక్షులు గంప రాంబాబు, గెడ్డం వివేక్, మంచర్ల నాగేశ్వరరావు, బట్ట నాగేందర్, కొండపర్తి నాని, నామనసాయి, రాజేష్, ముదుంబ శ్రీను, పూజారి ఆదిలక్ష్మి, షోలం హోంపతి, బట్ట పురుషోత్తం తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# బోధన్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- **- నీట్ పేపర్ లీక్ బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**

**బోధన్, నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**

ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువకులపై పెల్లెట్ల వర్షం కురిపించడం అత్యంత అమానుషమని వామపక్ష పార్టీల నాయకులు మండిపడ్డారు. నీట్ ఎగ్జామ్ పేపర్ల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేష్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు పుట్ట వరదయ్య మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ప్రదర్శనగా వెళ్తున్న విద్యార్థులు, యువకులపై లాఠీచార్జి, అశ్రువాయు ప్రయోగంతో పాటు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి పెల్లెట్ల వర్షం కురిపించడం దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు. నిరసన తెలుపుతున్న వారిపై తీవ్రవాదులు, దేశద్రోహులు అంటూ ముద్రవేసి ఉద్యమాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకునే నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని, దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నాయకులు ఎండీ ఇర్షాద్, గంగారాం, సీపీఐ (ఎం) నాయకుడు గోపి, ఎంసీపీఐ (యూ) నాయకుడు మోసిన్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకుడు నాగరాజుతో పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

- **బోధన్‌లో విజయవంతమైన విద్యాసంస్థల బంద్**

**బోధన్, నిజామాబాద్, 24 జూలై (డీడీ9 వార్త):**

దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విద్యా విధానాలు, విద్యార్థి ఉద్యమాలపై జరుగుతున్న నిర్బంధ చర్యలను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ బోధన్ పట్టణంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐఎఫ్డీఎస్ జిల్లా కన్వీనర్ ఎండీ మోసిన్ మాట్లాడుతూ.. దేశ విద్యార్థులు, యువత తమ హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతుంటే వారిపై లాఠీచార్జ్జిలు, బాష్పవాయువు ప్రయోగాలు, అక్రమ నిర్బంధాలు చేయడం ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ అని అన్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను ఉపయోగించడం అత్యంత దుర్మార్గమని ఖండించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం బ్రిటీష్ పాలనను తలపించే విధంగా నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ధ్వజమెత్తారు.
విద్యార్థులు, యువతపై జరిగిన దాడులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, ఉద్యమకారులపై బనాయించిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. న్యూఢిల్లీలో కొనసాగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా నిర్వహించిన బంద్‌ను విజయవంతం చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రజాసంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులోనూ పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్యూ జిల్లా అధ్యక్షులు కర్క గణేష్, గౌతం ప్రసాద్, నాయకులు మణితేజ, సాయినాథ్, ఏఐబీస్ నాయకులు గంగాప్రసాద్, రాజన్న, శ్రీను, అనిల్, ఏఐఎఫ్డీఎస్ నాయకులు అర్పుత్, నాగరాజు, సుమీద్‌తో పాటు పలువురు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకల భాగంగా గిఫ్ట్ ఏ స్మైల్ లో పరీక్ష ప్యాడ్ లు పంపిణీ.

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 25:**

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని అంకంపల్లి పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష మరియు స్వీట్లను బిస్కెట్లను పంపిణీ చేశారు,భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ,సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు అవసరమయ్యే కార్యక్రమాన్ని చేపట్టడంలో భాగంగా ఈరోజు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ పాల్గొని పరీక్ష ప్యాడ్లు అందజేశారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆకుల స్వామి వివేక్ పటేల్ ని సత్కరించారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాగరాజు యాదవ్., పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కర్నే రాజు నేత జాగినపు నర్సింగం,పాఠశాల సిబ్బంది యువజన నాయకులు మొదలైన వారి కార్యక్రమంలో పాల్గొన్నారు.



# హెల్మెట్ మీ ప్రాణాలకు రక్షణ కవచం... ప్రతి ప్రయాణంలో తప్పనిసరిగా ధరించండి.

**డిడి9వార్త / రామగుండం జులై 25:**

రామగుండం పోలీస్ కమిషనరేట్,పెద్దపల్లి జోన్,గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ చౌరస్తాలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనలు, ముఖ్యంగా హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ,ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు జరిమానాలు విధించడమే లక్ష్యంగా పనిచేయడం లేదని, ప్రతి ఒక్కరి ప్రాణాలను కాపాడడమే పోలీసుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వచ్చే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,అలాగే కార్లు,ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.సామాజిక మాధ్యమాల్లో లేదా ఇతర మార్గాల్లో "గల్లీ ల్లో తిరిగితే హెల్మెట్ అవసరం లేదు", "చిన్న దూరానికి వెళ్తే హెల్మెట్ పెట్టుకోనవసరం లేదు" వంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రమాదం ఎక్కడ, ఎప్పుడు జరుగుతుందో ఎవరూ చెప్పలేరని,చిన్న దూరం ప్రయాణం లోనూ ప్రాణాంతక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు.హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాల్లో తలకు తీవ్రగాయాలు కావడంతో పాటు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ,నిర్లక్ష్యం వల్ల కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోతున్నాయనన్నారు.ట్రాఫిక్ నిబంధనలు నగరంలోని ప్రధాన రహదారులకే కాకుండా ప్రతి రహదారి,ప్రతి వీధిలో సమానంగా అమలులో ఉంటాయని స్పష్టం చేశారు.జరిమానాల భయంతో అయినా హెల్మెట్ ధరించే



అలవాటు చేసుకుంటే చివరకు అదే వారి ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు.పాల ప్యాకెట్ తీసుకురావడానికి, సమీప దుకాణానికి వెళ్లడానికి లేదా చిన్న పని కోసం మాత్రమే వెళ్తున్నామని భావించి హెల్మెట్ ధరించకుండా ప్రయాణించ వద్దని సూచించారు.ప్రతి ప్రయాణంలో హెల్మెట్ ధరించడం వ్యక్తిగత భద్రతతో పాటు కుటుంబ సభ్యుల భవిష్యత్తుకు కూడా రక్షణగా నిలుస్తుందని అన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి,హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలి.ప్రజల ప్రాణాలను కాపాడటమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు..

- **భద్రాచలం ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**

**భద్రాచలం టౌన్, జూలై 24 (డిడి9 వార్త)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి, వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, నియోజకవర్గ నాయకుడు మానె రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం కేటీఆర్ చూపుతున్న అంకితభావం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అనంతరం వారు భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆసుపత్రికి తక్షణమే అవసరమైన వైద్య సిబ్బందిని కేటాయించడంతో పాటు, పడకలు, ఆధునిక వైద్య పరికరాలు, తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను కల్పించాలని కోరారు.

## సీఆర్‌పీఎఫ్ వాహనం ఢీకొని భద్రాద్రి రామాలయ ఉద్యోగి మృతి

- **సంతాపం వ్యక్తం చేసిన దేవస్థానం ఈవో , సిబ్బంది**

**భద్రాచలం, జూలై 24 డిడి9 వార్త**



భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కటకం రామిరెడ్డి(46) మృతి చెందాడు. యటపాక పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... రామిరెడ్డి ఉదయం రామాలయంలో విధులకు హాజరై మధ్యాహ్నం సమయంలో ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో నెల్లిపాక వద్ద 30వ నెంబరు జాతీయ రహదారి కూడలి వద్ద భద్రాచలం నుంచి చత్తీస్గడ్‌లోని కుంటకు వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ వాహన శ్రేణిలోని చివరి వాహనం రామిరెడ్డిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. టాటిన భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ సమయంలో పరీక్షించిన వైద్యులు అప్పటికే రామిరెడ్డి మృతి చెందినట్లు ధృవీకరించారు. ఉదయం రామాలయంకు వచ్చిన వ్యక్తి తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో రామిరెడ్డి సహచరులు, ఉద్యోగులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతి చెందిన విషయం తెలిసి దేవస్థానం ఈవో కె. దామోదర్‌రావు, ఆలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాసరెడ్డిలు రామిరెడ్డి కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం, సానుభూతిని తెలియజేసారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. శనివారం దేవస్థానం తరపున రామిరెడ్డి మృతదేహం వద్ద శేష మాలిక, శేష వస్త్రంతో పాటు, దేవస్థానం తరపున తగిన ఆర్థిక సహాయం అందించనున్నారు.





## పర్యవేక్షణ శూన్యం.. కాంట్రాక్టర్ రాజ్యం..!

- **బోర్ నర్సాపూర్ ఫెర్రీ రోడ్డు పనుల్లో అవకతవకల ఆరోపణలు**

**మంగపేట, జులై 24 డీడీ 9 వార్త**

మంగపేట మండలం బోర్ నర్సాపూర్ గ్రామ శివారులో ప్రధాన రహదారి నుంచి గోదావరి ఫెర్రీ పాయింట్ వరకు సుమారు రూ.2 కోట్ల ఐటీడీఏ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులపై గ్రామస్థులు, రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్థానికుల కథనం ప్రకారం, రోడ్డు పునాదిని సక్రమంగా చదును చేయకుండానే సీసీ మిశ్రమాన్ని వేస్తున్నారని, దీంతో రోడ్డు త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాల రాకపోకలను తట్టుకునేలా నిర్మాణం జరగడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అలాగే, పనులను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని, నాణ్యతపై ప్రశ్నించినా సరైన స్పందన లభించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పనులను పరిశీలించాలని, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

గమనిక: ఈ కథనంలోని ఆరోపణలు స్థానికులు, రైతులు చేసినవి. సంబంధిత అధికారులు లేదా కాంట్రాక్టర్ నుంచి స్పందన అందిన వెంటనే ప్రచురించబడుతుంది.





మణుగూరు సింగరేణి ఓపెన్‌కాస్ట్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మరియు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, రాందాసు నాయక్ లు.

**మణుగూరు.జూలై 24(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గంలోని మణుగూరు మండలంలో ఉన్న సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనిని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, వైరా శాసనసభ్యులు రాందాసు నాయక్ లు కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా గనిలో జరుగుతున్న బొగ్గు తవ్వకాల ప్రక్రియ, ఉత్పత్తి, భద్రతా ప్రమాణాలు, కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, గని నిర్వహణపై సింగరేణి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గని పరిసర ప్రాంతాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అలాగే సింగరేణి సంస్థ రాష్ట్ర అభివృద్ధికి, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైనదని పేర్కొంటూ, కార్మికుల సంక్షేమానికి, గని పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో సింగరేణి ఉన్నతాధికారులు, INTUC నాయకులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## మంగపేట మండలంలో "జలసిరి" కార్యక్రమంపై అవగాహన సదస్సు

**మంగపేట జూలై 24డీడీ 9 వార్త**

మంగపేట మండలంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "జలసిరి" కార్యక్రమంపై మండల స్థాయి అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. "ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత – ప్రతి ఊరికి ఒక ఊటకుంట" అనే నినాదంతో భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి సద్వినియోగం, నీటి వనరుల పెంపు, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, ప్రతి గ్రామంలో స్థానిక అవసరాలకు అనుగుణంగా నీటి సంరక్షణ నిర్మాణాలను ఏర్పాటు చేసి వర్షపు నీటిని వృథా కాకుండా భద్రపరచాలని సూచించారు.

ఈ అవగాహన కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల ( ఎస్ హెచ్ జి) సభ్యులు, ఐకేపీ ఆపీఎం లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు (సీసీలు), ఏపీవో లు, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. గ్రామ స్థాయిలో నీటి సంరక్షణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంలో వీరు కీలక పాత్ర పోషించాలని అధికారులు సూచించారు.

కార్యక్రమంలో భాగంగా ఫారం పాండ్‌లు, సోక్‌పిట్స్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్స్, పర్కొలేషన్ ట్యాంకులు వంటి నీటి సంరక్షణ నిర్మాణాల ఉపయోగాలు, భూగర్భ జలాల పెరుగుదలకు అవి చేసే దోహదాన్ని వివరించారు.

నీటి కొరతను అధిగమించి, భూగర్భ జలాలను సంరక్షించి, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర నీటి నిర్వహణను సాధించేందుకు ప్రతి ఒక్కరూ "జలసిరి" కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బద్రు , వ్యవసాయ అధికారి ఏవో చేరాలు , ఏపీఓ మొహమ్మద్ అంకూస్, ఏపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.





## దేశవ్యాప్త నిరసనలకు మద్దతుగా విద్యాసంస్థల బంద్ విజయవంతం

- **ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు బోడ జయరాజు**

**మంగపేట జూలై 24డీడీ 9 వార్త**



దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు మద్దతుగా ఎన్ఎస్‌యూఐ పిలుపు మేరకు నేడు మంగపేట మండలంలోని విద్యాసంస్థల బంద్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు బోడ జయరాజు తెలిపారు. మండల కేంద్రంతో పాటు మంగపేట,తిమ్మంపేట, కోమటిపల్లి,బాలన్నగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ,ప్రైవేట్ విద్యాసంస్థలను ఎన్ఎస్‌యూఐ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో బంద్ చేయించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని,అలాగే లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును,విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని తీవ్రంగా ఖండించారు.విద్యార్థుల హక్కులను పరిరక్షించడం,ప్రజాస్వామ్య విలువలను కాపాడడం కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలకు సంఘీభావంగా ఈ విద్యాసంస్థల బంద్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ఎన్ఎస్‌యూఐ నాయకులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ విభాగం తొలి సమావేశం ఘనంగా నిర్వహణ

**మంగపేట జూలై 24 డీడీ9 వార్త**

హైదరాబాద్ ఖైరతాబాద్ చింతల్ బస్తీలోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ విభాగం తొలి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో మహాముత్తారం పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంతకుమార్, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ సిద్ధంశెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రాజకీయ విభాగం చైర్మన్ అగిరి వెంకటేష్, మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వరరావు, సిరిపురం రాజేశ్వరరావును శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.





సమావేశంలో సమాజ అభివృద్ధి, ఆర్యవైశ్యుల రాజకీయ భాగస్వామ్యం, సంస్థ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ సమాజ సేవలో ముందుండాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్యవైశ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దేశంలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవా

- **విద్యాశాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ రాజీనామా చేయాలి**
- **విద్యార్థి సంఘాల నాయకుల వెల్లడి**

**భద్రాచలం టౌన్ , జూలై 24 (డిడి9 వార్త)**

నీట్ పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జిలు, టియర్ గ్యాస్ ప్రయోగించడం, నిర్బంధ చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పీడీఎస్యు జిల్లా కార్యదర్శి మునిగెల శివ ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కొపుపల రవీందర్‌లు పేర్కొన్నారు. శుక్రవారం విద్యా సంస్థల బంద్ పిలుపులో భాగంగా వారు మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కళ్లకు విద్యార్థుల ఆవేదన కనబడడం లేదా అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలకు బాధ్యులైన వారిలో బీజేపీతో సంబంధాలున్న వ్యక్తులు ఉన్నారనే ఆరోపణలు వచ్చినప్పటికీ, వారిని కాపాడేందుకే కేంద్ర ప్రభుత్వం అసలు దోషులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రశ్నాపత్రాల లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులు చైతన్య, కార్తీక్, ఆదిత్య, అభిషేక్ పాల్గొన్నారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.